




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 92 | ది. 10-7-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 92 | Date : 10-7-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

## బనగానపల్లె మీ భూమి మీహక్కు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు
- వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లచట్టమే
- పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై ఫోటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం
- పురాణాల్ని దూషించి, పాకిస్తాన్‌ను సమర్ధించిన రావణ్‌కు వైసీపీ ఆర్ధిక సాయం
- ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తూ, బతికి ఉన్న తల్లికి ఆస్తి ఇవ్వక క్షోభ పెడుతున్నారు



**బనగానపల్లె,జూలై 9 (వార్తాప్రభ) :** ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. "గడచిన రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందుతోంది. గత పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయి. లక్షల కుటుంబాలు వారి అరాచకానికి బలి అయ్యాయి. నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూముల్ని గత పాలకులు 22ఏ కింద చేర్చారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరిట ఓ నల్ల చట్టాన్ని తెచ్చారు. ప్రజల ఆస్తుల్ని కాజేసేలా భయాందోళనలు సృష్టించారు. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తేవటమే సమస్యను మరింత జటిలం చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేశాం. భూ వివాదాల పరిష్కారానికి దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. గత పాలకులు ప్రజల భూమి పత్రాలపైన, సర్వే రాళ్లపైనా ఫోటోలు ముద్రించుకున్నారు. ఆ ఫోటోల పిచ్చిని తుడిచేసేందుకు రాజ ముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నాం. కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లను పెట్టి తప్పులు లేకుండా రైతులు, భూ యజమానులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. ఇదో ఉద్యమంగా, పవిత్రమైన కార్యక్రమంగా చేపట్టి భూ యజమానులకు హక్కులు కల్పిస్తున్నాం. 2027 మార్చి నాటికి 9833 గ్రామాల్లో 72,70.,605 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేస్తాం. ఏపీని ఎలాంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. విలేజ్ ఇనామ్ భూములను కూడా 22ఏలో పెట్టేశారు. వీటిని 1971 గ్రామాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశాం. ఆటో మ్యూటేషన్ ద్వారా వారసత్వ ఆస్తుల్ని సంబంధిత వ్యక్తులకు చెందేలా చేస్తున్నాం. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరులోని వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుందిలో చాలా ఏళ్లుగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించాం. డోన్ నియోజకవర్గంలో ఉన్న 2074 ఎకరాల వక్ఫ్ భూముల్ని కూడా 22ఏలో గత పాలకులు పెట్టారు. ఆ భూముల్ని 22ఏ జాబితా నుంచి తొలగించి రైతుల సమస్యల్ని పరిష్కరించాం." అని సీఎం అన్నారు.

**వారు రాసింది రక్త చరిత్ర- మాది అభివృద్ధి సంకల్పం..**

"రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యల్ని పరిష్కరించటంతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి పనిచేస్తున్నాం. రాయలసీమ ముఖ చిత్రాన్ని మారుస్తున్నాం. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, అమ్కా డిఫెన్సు ఫైటర్ జెట్ ప్లాంట్ ఏర్పాటు అవుతోంది. డిఫెన్సు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో ప్రాజెక్టులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలతో రాయలసీమ రతనాల సీమగా మారుతుంది.

# ఏపీని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు సహకారం అందించండి

- 10 జి.డబ్ల్యు. డేటా సెంటర్ మౌలిక సదుపాయాల్లో భాగస్వామ్యం వహించండి
- స్వర్ణాంధ్ర -- 2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు చేయూత అందించండి
- యువతను ఫ్యూచర్ స్కిల్ వర్క్ ఫోర్స్ గా మార్చేందుకు సహకరించండి
- దక్షిణ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ & ఇన్వెస్ట్ మెంట్స్ ఉపమంత్రి కామ్చున్ కాంగ్ తో మంత్రి లోకేష్ సమావేశం




**సియోల్ (సౌత్ కొరియా), జూలై 9 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు దక్షిణ కొరియా సహకారం అందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. దక్షిణ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ & ఇన్వెస్ట్ మెంట్స్ ఉపమంత్రి కామ్చున్ కాంగ్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ యువతను భవిష్యత్తుకు సిద్ధమయ్యే డీప్ టెక్ వర్క్ ఫోర్స్ గా తయారు చేయడానికి కొరియా విశ్వవిద్యాలయాలు సహకారం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ లో 2029నాటికి 20లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యానికి మద్దతుగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, పాదరక్షల తయారీ, నౌకా నిర్మాణ రంగాల్లో కొరియా నైపుణ్య సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

**ఉమ్మడి పరిశోధనలకు సహకారం అందించాలి..** స్టూడెంట్/ఫ్యాకల్టీ ఎక్స్ ఛేంజ్ ప్రోగ్రామ్ లు, కరిక్యులమ్ డెవలప్ మెంట్ కోసం ఆంధ్రప్రదేశ్ -- కొరియా విశ్వవిద్యాలయాలను అనుసంధానించాలి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, నౌకా నిర్మాణం, ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థలు, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లీన్-టెక్, హెల్త్-టెక్ రంగాలలో సాంకేతిక పరిజ్ఞాన బదిలీపై పరస్పరం సహకరించుకోవాలి. వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్ ప్రెన్యూర్ అనే ఏపీ దార్శనికతను ముందుకు తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ లోని ఆర్ టీఐహెచ్, యూనివర్సిటీలు -- దక్షిణ కొరియా పరిశోధనా సంస్థలు, ఆవిష్కరణల కేంద్రాల (మాగోక్ సైన్స్ పార్క్, నానో ఫ్యాబ్ సెంటర్ వంటివి) నడుమ ఉమ్మడి పరిశోధన, అభివృద్ధికి సహకారం అందించండి.

**ఏపీలో కొరియా పారిశ్రామిక పార్క్ ఏర్పాటుచేయండి..**

ఆంధ్రప్రదేశ్ లోని కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా ఒక కొరియా పారిశ్రామిక పార్క్‌ను ఏర్పాటు చేయండి. ఇందుకు అవసరమైన భూమిని ఏపీఐఐసీ ల్యాండ్ బ్యాంకు ద్వారా అందిస్తాం. ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు, ప్రత్యేక సింగిల్-విండో క్లియరెన్స్ యంత్రాంగం, ఆర్థిక ప్రోత్సాహకాలు, విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ కనెక్టివిటీ వంటి పటిష్టమైన, ప్రత్యేక విధాన ప్యాకేజీతో పాటు, పూర్తిస్థాయి సౌకర్యాల కోసం ఒక కొరియా-డెస్క్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో రాబోయే 10 GW సామర్థ్యం గల డేటా-సెంటర్ ప్రాజెక్టులను అమలు చేయడానికి అవసరమైన ఇంధన-మౌలిక సదుపాయాల ప్రణాళికలు, నియంత్రణ విధానాలను రూపకల్పనలో సహకరించేలా రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్రభుత్వంతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కోరుతున్నాం.

**మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించండి..**

ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలో అగ్రగామి పెట్టుబడి గమ్యస్థానంగా నిలిపేందుకు మౌలిక సదుపాయాల నిర్మాణంలోకి కొరియన్ దిగ్గజాలను ఆహ్వానిస్తున్నాం. ప్రస్తుతం ఏపీలో ఉన్న 6 పోర్టులు, 7 విమానాశ్రయాలకు అదనంగా 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, కొత్త విమానాశ్రయాలు రాబోతున్నాయి. ఇవి హెచ్‌డీ కేఎస్ఓఈ, శాంసంగ్ షిప్పింగ్, హన్వా ఓషన్ వంటి కొరియన్ సంస్థలకు గణనీయమైన అవకాశాలను అందిస్తాయి.

# ముఖ్యమంత్రి హామీల అమలుకు వేగం పెంచాలి..

- ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలి
- నియోజకవర్గాల వారీగా ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై సమగ్ర సమీక్ష
- ...రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్



**విజయవాడ,జూలై 9 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఎలాంటి జాప్యానికి తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. విజయవాడ కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో గురువారం ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యమంత్రి హామీల అమలుపై నియోజకవర్గాల వారీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి ప్రకటించిన హామీల అమలుపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రధానంగా మూడు ఆర్థిక, మూడు ఆర్థికేతర అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని వాటి పురోగతిని పరిశీలించినట్లు చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. తిరువూరు నియోజకవర్గంలో కట్టలేరు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ట్రైబల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ట్రైబల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సమీక్షించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అనుమతులను త్వరితగతిన పూర్తి చేసి, నిధుల ప్రతిపాదనలను ఆలస్యం లేకుండా సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి హామీల అమలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, ప్రజల అంచనాలకు అనుగుణంగా ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశా, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ విజయవాడ 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజను) కోర్టులో**

O. S. No. 19 / 2025

Between:

నేతుల విజయ భాస్కర్
S/o లేటు సత్యం,
డోరునెంబరు. 8-10-4/2,
అబ్దుల్ రజాక్ వీధి,
విజయవాడ-1.

--------వాది

మరియు

ఆదిరెడ్డి యేసుబాబు
S/o లేటు దేవుడు
C/o కె.చంద్రమౌళి
యాదవుల బజారు ఎదురు,
తాలూకా ఆఫీసు రోడ్డు,
రాయనపాడు-521241

--------ప్రతివాది

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదిపై ప్రోనోటు బాకీ రాబట్టు కొనుటకు , దావా దాఖలు చేయగా, ప్రతివాదినూ, పై కోర్టులో ది. 12-8-2026వ తేదీన ఉదయం గం॥10.30 ని॥లకు హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో పరోక్షమముగా తీర్మానించెదరు.

**(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)**
**వాయిదా తేది :12.08.2026**

**ఇట్లు**

**P.N.P.K. Tilak**
**Advocate for Plaintiff**
**Vijayawada**
**Cell : 9440197815**

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VIJAYAWADA**

O.S.No : 236/2024

Between :

M/s G.B.R. Hatcheries Pvt.Ltd., rep by its Director Bobba Sambasiva Rao

--------Plaintiff

And

Yalamanchili Pradha Saradhi

--------Defendant

To,

**Defendant :**

Yalamanchili Pradha Saradhi, R/o Flat No.113, Ganesh Harmony, Near Gowtham School, Santhi Nagar, Gudiwada, Krishna District-521301

పై నెంబరు దావా లోని ప్రతివాది పై కోర్టు వారి ఎదుట మీ యొక్క హాజరు నిమిత్తము ది.11-08-2026వ తేదీన ఉదయం గం.10.30ని॥లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా కానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల పై నెంబరు గల దావాను మీ పరోక్షము నందు తీర్మాణించబడును.


**(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)**
**వాయిదా తేది : 11-08-2026**

ఇట్లు

**M.BHAVANI SHANKAR**
LL.M., M.B.A.,
Advocate
OPP : SRR Collage, Machavaram, Vijlayawada-520 004
Cell No : 8886336666, 9652206666

# పేద విద్యార్థుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయుడు కృషి

- ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు వర్తింపు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి




**అమరావతి, జూలై 9 (వార్తాప్రభ) :** పేద విద్యార్థుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ...సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సంక్షేమం అందిస్తున్నాం. సంక్షేమ శాఖలపై నిన్నటి సమీక్షలో డైట్ చార్జీలు 10 శాతం పెంచుతూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు వర్తింపు చేయాలని సీఎం ఆదేశించారు. హాస్టళ్ల స్థానంలో గురుకులాల నిర్మాణం చేపట్టేందుకు పెద్దపీట వేస్తున్నాం. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో నెట్‌జీరో విధానం అమలు చేస్తాం. బయో డైవర్సిటీ పార్కుల తరహాలో గురుకులాలను నిర్వహించనున్నాం. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింటెనెన్స్ గ్రాంట్ నిమిత్తం రూ.100 కోట్లు కేటాయిస్తామని సీఎం తెలిపారు.




## పెడన పిహెచ్ సి ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక ర్యాలీ



**పెడన,జూలై 9 (వార్తాప్రభ) :** పెడన పట్టణ ఆరోగ్య కేంద్రం నందు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం పురస్కరించుకొని వైద్యాధికారి డాక్టర్ టి.హిమ పద్మజా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడమైనది రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ మలేరియా చికెన్ గునియా మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం వున్నందున వాటిని సమర్థవంతంగా నివారించేందుకుగానుతీసుకోవలసిన చర్యలు గురించి ఈ ర్యాలీలో ప్రజలకు అవగాహన కల్పించడమైనది ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పి మురళి సూపర్వైజర్ బి సూరిబాబు హెల్త్ అసిస్టెంట్ సతీష్ బాబు కోటేశ్వరరావు మరియు ఏఎన్ఎంస్ ఆశాసుసిబ్బంది అందరూ పాల్గొన్నారు

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియ చట్టబద్ధం

### -విస్సన్నపేట క్లస్టర్ ఇంచార్జ్ దాబా శ్రీను



**విస్సన్నపేట,జూలై 9 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాలను అప్డేట్ చేసే ప్రక్రియలో కూటమి ప్రభుత్వ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జెట్ స్పీడ్ తో జరుగుతోందని విస్సన్నపేట క్లస్టర్ ఇంచార్జ్ నెక్కలపు శ్రీనివాసరావు( దాబా శ్రీను) మీడియా సమావేశంలో తెలియజేశారు. చనిపోయిన ఓటర్లు, వలస వెళ్లిన వాళ్ళను తొలగింపు,సుదీర్ఘకాలంగా వలస వచ్చి ఉన్నవారికి కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, అర్హులైన వారందరి పేర్లు జాబితాలో ఉండే విధంగా యుద్ధ ప్రాతిపదిక చర్యలు తీసుకోవడం దీని ప్రధాన ఉద్దేశం అని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కర్ణాటక మహారాష్ట్ర ఢిల్లీ పంజాబ్ రాష్ట్రాలతో కలిపి 16 రాష్ట్రాలు మరియు మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ కార్యక్రమం జరుగుతోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బి ఎల్ ఓ లు, బిఎల్ ఎలు జిల్లా కార్యవర్గ నాయకులు ఏ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏ కొండూరు (మం) చీమలపాడు లో పర్యటించిన జిల్లా కలెక్టర్ జి లక్ష్మీ శా..



**ఏ కొండూరు,జూలై 9 (వార్తాప్రభ) :** ఎస్ఐఆర్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన-కలెక్టర్ జి లక్ష్మీ శా.. యూరియా పంపిణీ పారదర్శకంగా జరగాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ జి లక్ష్మీ శా..కలెక్టర్ వెంట ఆర్డీవో ఏ కుమార్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు ఉన్నారు

## కమలాపురం డిసి పరిధిలో కాలువ గట్లు పటిష్టం





**పెడన,జూలై 9 (వార్తాప్రభ) :** బంటుమిల్లి కాలువ గట్లు పటిష్టత పరచే కార్యక్రమం కొనసాగుతుంది. పెడన నియోజకవర్గం లోనే ఇది మేజర్ కాలువగా వుంది. కొన్నిచోట్ల గట్లు బలహీనంగా ఉండటం వల్ల భారీ వర్షాల సమయంలోఆయకట్టు రైతులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో డీసీ పాలకవర్గం రానున్న వర్షాకాలన్నీ దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. బలహీనంగా వున్న చోట్ల అవసరం మేరకు పనులను చేపట్టారు.కమలాపురం డిసి 20 పరిధిలో ఈ పనులు సాగుతున్నాయి. డిసి చైర్మన్ నల్లమోతు చంద్రమోహన్ రావు నేతృత్వంలో నియోజకవర్గ జనసేన నాయకుడు నల్లమోతు రఘురామ్ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. గట్టు బలహీనంగా ఉన్న చోట బల్లీలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కాలువలో దట్టంగా పేరుకుపోయిన గుర్రపు డెక్కను కూడా తొలగించేస్తున్నారు. ఓల్డ్ కలిదిండి కాలువ దగ్గర పడిన ఊళలను కూడా సరి చేస్తున్నారు. ఈ కాలు ద్వారా పెడన బంటుమిల్లి కృత్తివెన్ను మండలాలుకు చెందిన వేలాది ఎకరాలు భూములు సాగు అవుతుంది. దీని పరిధిలో పంట పొలాలతో పాటు చేపల రొయ్యల చెరువులు కూడా ఉన్నాయి. జిల్లాలోనే శివారు భూములుగా వున్నాయి.

## కాపులూ...కాంగ్రెస్ తో కలవండి ముఖ్యమంత్రిని చేస్తాం

### - కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్.



**రాజమండ్రి,జూలై 9 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు కాపులు ఒక్క రోజు కూడా ముఖ్యమంత్రి కాలేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. సుమారు 20/ శాతం జనాభా కలిగి, ఓటర్లలో అత్యధిక శాతం ఉన్న కాపు సామాజిక వర్గం రాజకీయంగా తీవ్ర నిర్లక్ష్యానికి, అణచివేతకు గురైందన్నారు. ముఖ్యమంత్రి పదవి ఒక్క రోజు కూడా అనుభవించలేదన్నారు. జగన్, చంద్రబాబు ఇరువురూ కాపులను ముఖ్యమంత్రిగా అంగీకరించరని, వారు లేదా వారి వారసు లను మాత్రమే ముఖ్యమంత్రిగా ప్రమోట్ చేసుకుంటారని తెలిపారు. కాపు సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే, ముఖ్యమంత్రి అవుతారని చింతామోహన్ పేర్కొన్నారు.గురువారం రాజమండ్రి లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా కావాలని కోరుతున్నారని, వారు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే, తప్పకుండా అధికారంలోకి రాగానే, రాజ్యాంగ సవరణ చేసి, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇస్తామన్నారు. బిజెపి అవినీతిలో ముందంజలో ఉందన్నారు. అయోధ్య పేరుతో వేల కోట్ల రూపాయలు సేకరించి వాటిని దుర్వినియోగం చేశారని విమర్శించారు. నిధుల వినియోగంపై సిబిఐతో విచారణ జరిపించి, సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థ పనితీరుపై ప్రజల్లో రోజురోజుకూ నమ్మకం సన్నగిల్లుతోందని తెలిపారు. ఒకే తరహా కేసుల్లో వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు విధాలుగా న్యాయం జరుగుతోందనే భావన ప్రజల్లో బలంగా ఉందన్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో జయలలితకు ఒక న్యాయం? జగన్ కు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. జగన్ కు మోడీ మద్దతు ఉందన్నారు. అందుకే కేసులు విచారణ ఆలస్యం అవుతోందన్నారు. గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.7000/ కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తొక్కిసలాట జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలని కోరారు. మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని, ఫలితంగా ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. ఏపీలో అభివృద్ధి ఆశించిన స్థాయిలో కనిపించడం లేదన్నారు. 23 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు తెచ్చామని అంటున్నారు. కానీ 23 జిల్లాలు తిరిగిన నాకు, ఏ ఒక్క జిల్లాలోనూ కోటి రూపాయలు అభివృద్ధి కనిపించలేదన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై ప్రజల్లో విమర్శలు వినిపిస్తున్నాయి, ప్రతి చిన్న విషయానికీ కేసులు, అరెస్టులు, పోలీసు 30 యాక్టు పెట్టడం తగదన్నారు.

## ప్రశ్నిస్తే సంకెళ్లు వేస్తారా?

### -సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య.



**చల్లపల్లి/అవనిగడ్డ,జూలై 9 (వార్తాప్రభ) :** ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సంకెలు వేస్తారా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రశ్నించారు. కృష్ణా జిల్లా చల్లపల్లి లోని చంద్ర రాజేశ్వరారావు వికాస కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు ప్రశ్న రావణ్‌ను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలపై జరిగిన తీవ్ర దాడి గా అభివర్ణించారు. ప్రభుత్వ విధానాలను, వైఫల్యాలను ప్రశ్నించే వారిపై రాజద్రోహం వంటి తీవ్రమైన కేసులు నమోదు చేసి అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. విమర్శలను రాజకీయంగా ఎదుర్కోవాల్సింది పోయి, పోలీసు వ్యవస్థను ఉపయోగించి భయభ్రాంతులకు గురి చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరం కాదని, ప్రజల తరపున మాట్లాడే గొంతులను కేసులు, అరెస్టులతో అణచివేయాలని చేసే ప్రయత్నాలు చివరికి ప్రజాస్వామ్య వ్యవస్థనే బలహీనపరుస్తాయని హెచ్చరించారు. భిన్నాభిప్రాయాలను చర్చతో ఎదుర్కొనే బదులు నిర్బంధాలతో సమాధానం చెప్పడం అధికార అహంకారానికి నిదర్శనమని అన్నారు. ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, రాజకీయ కక్షసాధింపుతో కొనసాగుతున్న వేధింపులను నిలిపివేయాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈనెల 14 వ తారీఖుతో సర్ ప్రక్రియ ముగుస్తున్న తరుణంలో మరో మూడు నెలలు గడువు పెంచాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాపితంగా ఇప్పటివరకు 48శాతం ఓట్లు రిజిస్ట్రేషన్ అవ్వలేదని, అందువల్ల గడువు పెంచాలని కోరారు. సర్ ప్రక్రియ పై బి ఎల్ వో లు గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉండగా అలాంటి ప్రక్రియ ఎక్కడ జరగలేదన్నారు. జిల్లా కలెక్టర్లు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టాలన్నారు. చని పోయిన వారి, వేరేదేశాల నుండి వచ్చిన వారి ఓట్లు తొలగిస్తే అభ్యంత్రం లేదు గాని సర్ పేరుతో వాస్తవ ఓటర్లను తొలగిస్తే సహించేది లేదన్నారు.అయోధ్య రామాలయం లో రెండువందల కోట్లు విలువైన బంగారు ఆభరణాలు దొంగతనం జరిగితే దానికి బాధ్యులెవరో తేల్చాల్సిన బాధ్యత మీపై లేదా అంటూ మండిపడ్డారు. ఈ కార్యక్రమం లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి శంకర్, జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, సీనియర్ నాయకులు మాలెంపాటి కాంచనరావు లు పాల్గొన్నారు.

## ఉదయం 5 గంటలకే రోడ్డెక్కుతున్న కమిషనర్ కే. మనోజ్

### -ప్రతి వార్డులో పర్యటన, ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం




**తిరువూరు,జూలై 9 (వార్తాప్రభ) :** ప్రజా సేవ అంటే గంటలు చూడడం కాదు, బాధ్యతగా పనిచేయడం అని తిరువూరు మున్సిపల్ కమిషనర్ కే. మనోజ్ నిరూపిస్తున్నారు. రోజూ తెల్లవారుజామున 5 గంటల నుండే ఆమె విధుల్లోనిమగ్నమవుతున్నారు. అధికారులు, పారిశుధ్య సిబ్బందితో కలిసి పట్టణంలోని అన్ని 20 వార్డుల్లో కాలినడకన పర్యటిస్తున్నారు.


**సమస్య ఉన్న చోటికే పరిష్కారం..** పర్యటనలో వీధి దీపాలు వెలగకపోవడం, డ్రైనేజీల్లో అడ్డంకులు, చెత్త పేరుకుపోవడం, రోడ్లపై గుంతలు, తాగునీటి సమస్యలను స్వయంగా గుర్తిస్తున్నారు. వెంటనే సంబంధిత సిబ్బందిని పిలిపించి అక్కడికక్కడే పనులు చేయిస్తున్నారు. "ఫిర్యాదు వచ్చే వరకు ఆగొద్దు, మనమే వెళ్లి చూడాలి" అని సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఉదయాన్నే పట్టణం అంతా కలియతిరగడం వల్ల అక్రమంగా చెత్త వేసేవారిపై నిఘా పెరిగింది. అదే సమయంలో పారిశుధ్య కార్మికులు కూడా సమయానికి విధులకు హాజరవుతున్నారు.


**ప్రజల నుండి ప్రశంసలు..** కమిషనర్ ఈ క్షేత్రస్థాయి పర్యటనలతో తిరువూరు పట్టణంలో పారిశుధ్యం గణనీయంగా మెరుగుపడిందని స్థానికులు అంటున్నారు. "ఇంతకు ముందు కమిషనర్ ఆఫీస్‌లో కూర్చునేవారు. కానీ ఇప్పుడు మన వీధుల్లోకి వచ్చి సమస్యలు అడుగుతున్నారు. ఇది నిజంగా మంచి మార్పు" అని ఒక స్థానికుడు చెప్పారు.మహిళా కమిషనర్ అయినప్పటికీ ఎండ, వాన చూడకుండా పని చేస్తున్న తీరుఅధికారులకు, సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

**లక్ష్యం ఒక్కటే - పరిశుభ్ర ..** తిరువూరును రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా నిలబెట్టడమే లక్ష్యం. ప్రజల సహకారంతోనే ఇది సాధ్యం" అని కమిషనర్ కే. మనోజ్ తెలిపారు.అధికారులు ఇలా ప్రజల్లోకి వెళితేనే నిజమైన పరిపాలన ఉంటుందనడానికి తిరువూరు మున్సిపల్ కమిషనర్ కే. మనోజ్ గారి పని తీరు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుంది.

## ఎవరు ఊహించని పరిణామం అది కూటమి ప్రభుత్వానికే సాధ్యం







**విస్సన్నపేట,జూలై 9 (వార్తాప్రభ) :** స్థానిక గ్రామపంచాయతీ వందల ఏళ్ళ చరిత్రలో ఏనాడు ఎవరు ఊహించని మార్పు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జరుగుతోందంటే ఎలాంటి అతిశయోక్తి లేదని చెప్పాలి. 18వ శతాబ్దంలో ప్రస్తుత విస్సన్నపేట మండల కేంద్రంలో శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి ఆలయం నిర్మాణం కాకతీయ రాజులు కాలంలో ఏలూరు మోతే సంస్థానాదీసులు నూజివీడు జమీందారులు సంయుక్తంగా కాశీ నుండి శివలింగాన్ని బోయలు జోలి కట్టుకొని ఎక్కడ కింద పెట్టకుండా తీసుకువచ్చి ప్రతిష్టించారనే విషయాన్ని తరతరాలుగా చెప్పుకోవడం జరుగుతుంది. కొండ పర్వ మల్లయ్య స్వామి గట్టు పైకి పాదయాత్రగా వెళ్లి స్వామివారిని కార్తీకమాసం శివరాత్రి తిరునాళ్లు సమయాలలో దర్శించుకోవడం జరిగేది. వయసు మళ్ళిన వాళ్ళు మరలా గట్టు ఎక్కగలమా అనుకునే పరిస్థితిలో ఆలయ ట్రస్ట్ కుటుంబీకులు గొట్టి పూళ్ళ బుచ్చినాయన రంగారావు రమేష్ బాబు చంద్రశేఖర్ కుటుంబీకులు మరియు గ్రామస్తులు సహాయ సహకారాలతో గట్టు పైకి వాహనాలు వెళ్లే విధంగా రోడ్డు నిర్మించడం అసాధ్యాలను సుసాధ్యం చేయటమేనని చెప్పుకోవచ్చు. అదే బాటలో ప్రస్తుతం కోనేరు ప్రాంతాన్ని గతంలో గ్రామంలో కమ్మటూరు కుమ్మరి బజార్ పద్మశాలి స్టేట్ కుక్కడపు వారి వీధి, కొత్తపేట శివాలయం వీధి రామవరపు వారి వీధి కందకం బజార్ షాది ఖానా రోడ్ వికాస్ టెక్నో స్కూల్ ఏరియాల వారీగా పడిన వర్షం వాడిన నీరు కోనేరులో కలిసేదని పరిసర ప్రాంత వాసులు తెలియజేస్తున్నారు. అలాంటి పరిస్థితి నుండి ప్రస్తుతం 50 లక్షల రూపాయల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వల నిధులతో కోనేరు చెరువు అభివృద్ధికి లలితా రామకృష్ణ పర్యవేక్షణలో ప్రభుత్వ అధికారుల సహాయ సహకారాలతో నైనానందకరంగా చెరువు కట్ట వెడల్పు వాకింగ్ ట్రాకర్ ఫల పుష్ప ఔషధ మొక్కల ఏర్పాటు, కోనేరులో గతంలో ఉన్న నీటిని ఇప్పటికే తొలగించడంతో రెండు బోర్లు వేసి బోర్ వాటర్ తో కోనేరును నింపటమే కాకుండా బోట్ షికార్ వంటి ఉల్లాసవంతమైన ఉత్సాహవంతమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు జిమ్ ఫెసిలిటీ కూడా ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. మరోవైపు సోలార్ సిస్టం ద్వారా దేదీప్యమానంగా నిండు పున్నమి వెలుగులను పిండి ఆరబోసిన చందంగా ప్రతి రాత్రి లైటింగ్ అరేంజ్మెంట్ అందించేందుకు నభూతో న భవిష్యతి అన్న చందంగా ఎవరో ఎప్పుడూ ఎక్కడ ఊహించని విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఈవో హరికృష్ణ కుమార్ వెలుగు ఏపీఓ రామారావు తదితరులు ప్రత్యక్షంగా సొంత ఇంటి నిర్మాణం చేస్తున్న రీతిలో ఉదయం సాయంత్రం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాకు మూడు చెరువుల మంజూరు కాగా విస్సన్నపేట కోనేరు యుద్ధ ప్రాతిపదికన పనులు జరగటం ఒక చరిత్రని చెప్పవచ్చు అని పలువురు అంటున్నారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన బిడ్డ: డాక్టర్ అఫ్రోజ్

### గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ



**కాకినాడ రూరల్ / కరప,జూలై 9 (వార్తాప్రభ) :** పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించవచ్చని కరప పీహెచ్ వైద్యాధికారి డాక్టర్ అఫ్రోజ్ అన్నారు.కాకినాడ రూరల్ మండలం కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణీ స్త్రీలకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ పథకంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్లు డాక్టర్ అఫ్రోజ్ తెలిపారు.ఈ సందర్భంగా కరప గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు( నారయ్య ) కోరిక మేరకు మేడపాటి నాగ వీర సుబ్బారెడ్డి సహకారంతో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారని పంపిణీ చేసినారు.పౌష్టకాహారం అందించిన మేడపాటి నాగ వీర సుబ్బారెడ్డి సేవా గుణాన్ని వైద్యాధికారి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంజిలిన్,పీహెచ్ఎన్ సత్యనారాయణమ్మ, హెల్త్ అసిస్టెంట్ వనుం శ్రీనివాసరావు,కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు,మేడపాటి నాగ వీర సుబ్బారెడ్డి,(చంటి రెడ్డి)కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవు వెంకటేశ్వరావు , కసిలంక రాజా, పేపకాయల తణుకుల రాజు,బలిరెడ్డి సతీష్, శ్రీ పాదం శ్రీను, నాగ సత్య కృష్ణమూర్తి, ఏఎన్ఎం ధనలక్ష్మి,సరళ కుమారి, ఉష,తదితరులు పాల్గొన్నారు.

## కీర్తిశేషులు తెర్లి రంగారావు జ్ఞాపకార్థం కరిమ్ సోషల్ సర్వీస్‌కు ఫ్రీజర్ బాక్స్ విరాళం




**హనుమాన్ జంక్షన్,జూలై 9 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్‌లో కీర్తిశేషులు తెర్లి రంగారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెర్లి రంగారావు కుమార్తెలు నడిమింటి ధనలక్ష్మి -- సత్యనారాయణ దంపతులు, గులిపల్లి వరలక్ష్మి -- వెంకటేశ్వరరావు దంపతుల ఆర్థిక సహకారంతో, నడిమింటి ధనలక్ష్మి--సత్యనారాయణ దంపతుల కుమారుడు, ధనలక్ష్మి నర్సింగ్ హోమ్‌కు చెందిన డాక్టర్ నడిమింటి బలరామకృష్ణ (డాక్టర్ బాలు) ఆధ్వర్యంలో కరిమ్ సోషల్ సర్వీస్ సంస్థకు ఒక ఫ్రీజర్ బాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా కరిమ్ మాట్లాడుతూ, హనుమాన్ జంక్షన్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఫ్రీజర్ బాక్స్ సేవలను పూర్తిగా ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. అవసరమైన వారు 98488 99161 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సేవా కార్యక్రమాన్ని పలువురు అభినందిస్తూ, సమాజానికి ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## పోడు హైస్కూల్ నందు పి ఎం శ్రీ కార్యక్రమం పై అవగాహన....



**కృత్తివెన్ను ,జూలై 9 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం పోడు గ్రామం గురువారం నాడు పోడు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు 8 మరియు 9 వ తరగతి పిల్లలు కు పీఎం శ్రీ స్కూల్స్ పథకం కింద భూసారం మరియు భూపరిరక్షణ మీద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యాకారం ద్వారా పిల్లలు మట్టి యొక్క విలువ , మట్టి మన జీవనాధారం కి ఎంత దోహద పడుతుంది మరియు అలంటి మట్టి ని మనం అంటే మన తల్లి తండ్రులు అంటే రైతులు ఎక్కువ గ ఎరువులు వేస్తే వచ్చే దుష్ప్రభావాలు గాలి నీరు మట్టి కాలుష్యం చేస్తే మన ఉనికే కె ప్రమాదం అని , దాని మనం భూసార పరీక్షలకు పంపించి ఏమి లోపిస్తే ఆ ఎరువులు మోతాదు కి మించా కుండా వేసుకోవాలి అని తెలియపరిచారు . మట్టి నమూనాలు ఎలా తీయాలి అని కుడా వివరించారు ఏ కార్యక్రమం నందు ఘంటసాల కేవీకే సైంటిస్ట్ శ్రీ నవీన్ మండల వ్యవసాయ అధికారి శ్రీ పీఎం కిరణ్ మరియు జడ్పీ హెచ్ స్కూల్ ప్రిన్సిపాల్ వీరాంజనేయులు పాల్గొన్నారు ...

## దాతల సహకారంతో ఉచిత నోటుబుక్ పంపిణీ



**కోడూరు, జూలై 9 (వార్తాప్రభ) :** కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ కైవల్యానంద స్వామి పుట్టిన రోజు సందర్భంగా, బుర్రా పద్మనాభ శర్మ చేతుల మీదుగా ఉల్లిపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఉన్న 220 మంది విద్యార్థులకు 75000 విలువ గల నోట్సు పుస్తకాలు మరియు స్టేషనరీ, వస్తువులు పంపిణీ చేశారు స్వామి పర్యవేక్షణలో, శివన్నారాయణ ఆధ్వర్యంలో 500 గ్రామస్తులకు అన్న సందర్భంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి టీ వి ఎం రామదాసు గారు , చక్కా శ్రీమన్నారాయణ, చెక్క నాగలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె ఓంకార్, మరియు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, బిజెపి ప్రతిష్ట పెంచేందుకు కృషి చేయండి

**-బిజెపి అధికార ప్రతినిధులకు బిజెపి ఇన్చార్జ్ రవికుమార్ సత్కారం**



**శేరిలింగంపల్లి,జూలై 9 (వార్తాప్రభ):** భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధులుగా నూతనంగా నియమితులైన ఆంజనేయులు సాగర్,గోపాల్ రావులను గురువారం మసీద్‌బండ, కొండాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎం. రవికుమార్ యాదవ్ శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను నిజాయితీ,క్రమశిక్షణతో నిర్వహిస్తూ అందరినీ కలుపుకొని పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ సంస్థాగత బలోపేతానికి వ్యూహాత్మకంగా కృషి చేయాలని అన్నారు. పార్టీలో అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఆంజనేయులు సాగర్, గోపాల్ రావు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలను పాటిస్తూ అందరితో సమన్వయంగా పనిచేసి, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కనకయ్య, శ్రీనివాసులు, వేణు, వేణుగోపాలస్వామి, పద్మ, సైదమ్మ, నర్సింగ్, చందు, ఆంజనేయులు, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తా

**-పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ**





**శేరిలింగంపల్లి,జూలై 9 (వార్తాప్రభ):** హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ, జనప్రియ నగర్ ఫేజ్-1, మాధవ నగర్,అంబేద్కర్ నగర్ కాలనీలలో రూ.4 కోట్ల 9 లక్షల 7 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం, స్మశానవాటిక అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ,మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో,మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందిస్తామని తెలిపారు. అంబేద్కర్ నగర్ స్మశానవాటికను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి కాలనీలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు,స్థానికులు పాల్గొన్నారు.

# దేవాలయాలు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక.

**- మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి,జూలై 9 (వార్తాప్రభ):** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి తండా బృందావన్ కాలనీలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఆంజనేయస్వామి, శివాలయం, నాగదేవత, నవగ్రహాల విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం, దైవభక్తిని పెంపొందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సమాజంలో ఐకమత్యాన్ని పెంపొందించే కేంద్రాలుగా దేవాలయాలు నిలుస్తాయని, వాటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. గచ్చిబౌలి డివిజన్‌లో ఆధ్యాత్మిక, సామాజిక అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని గంగాధర్ రెడ్డి తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేఖర్, సుమన్, రంగస్వామి, దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 13న టి.డబ్ల్యు.జే.ఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం..

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ అంబాల విష్ణు పిలుపు...



**జవహర్ నగర్, జూలై 9:(వార్తా ప్రభ)** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా (టి డబ్ల్యు జె ఎఫ్)13,వ తేదీన మేడ్చల్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యుజెఎఫ్) మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అంబాల విష్ణు పిలుపు నిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని అభిప్రాయపడ్డారు. ఈ నెల13న జిల్లా కలెక్టర్కు వినతిపత్రాలు అందజేసి నిరసనలు తెలిపామని తెలిపారు. 15న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. జర్నలిస్టుల హెల్త్‌కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. హెల్త్ కార్డులు నిమ్స్ ఆస్పత్రి మినహా ఏ ఇతర కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేయడం లేదని వ్యాఖ్యనించారు. వెంటనే జర్నలిస్టులందరికీ నూతన హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఇండ్ల స్థలాలపై నిర్ణయం తీసుకోకపోవడంతో కార్యాచరణ ముందుకు సాగడం లేదని తెలిపారు. ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు జర్నలిస్టులకు ఆశలు కల్పించి ఆ తర్వాత వారి ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ఆలస్యమవుతున్నదని,అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడేషన్ కార్డులు ఆలస్యం కావడంతో బస్‌పాసులు రాక జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తేచేశారు. జర్నలిస్టులకు పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు .ప్రయివేట్,కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని విష్ణు విజ్ఞప్తి చేశారు.

# చెత్త లారీల బంద్ కు సంఘీభావం

**- యాంటి డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసి చేపట్టిన కార్యక్రమానికి సంఘీభావం తెలియజేసిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి - రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి నిలబెట్టుకోవాలని డిమాండ్.-ఎలాంటి అరెస్టులకు పాల్పడిన డంపింగ్ యార్డు బాధితులను మోసగించడమే.-జూలై-10 నుండి 20 వరకు పాదయాత్రలు- చైర్మన్ షేక్ షావలి.**

**జవహర్ నగర్, జూలై 9:(వార్తా ప్రభ)** యాంటి దమ్మాయిగూడ జేఏసీ 2026, జూలై-11, శనివారం రోజు చేపట్టిన మూడు కార్పొరేషన్ల నుంచి జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలించే చెత్త లారీల బంద్ కు జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ సంఘీభావం తెలియజేస్తున్నదని చైర్మన్ షేక్ షావలి నేడొక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. 2026, జూలై-9, గురువారం రోజు, స్థానిక కీసర సర్కిల్, జవహర్ నగర్ జిహెచ్ఎంసి, ప్రగతినగర్, నీలం రాంచంద్రయ్య భవనంలో లారీల బంద్ మరియు భవిష్యత్ కార్యచరణలో బాగంగా జూలై-26 న చేపట్టబోయే అవగాహన సదస్సును దృష్టిలో పెట్టుకొని పాదయాత్రలపై జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన కో కన్వీనర్లు, కమిటీ సభ్యుల అత్యవసర సమావేశం జరిగింది. యాంటి డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసీ నేతలు గత 11 సంవత్సరాలుగా లక్షలాది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న డంపింగ్ యార్డు తొలగింపుకై న్యాయపోరాటాన్ని కొనసాగించడమే గాక, మే-4 న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డు శాశ్వత పరిష్కారం కోసం హామీ ఇచ్చి, రెండు నెలలు పూర్తయిన ఎలాంటి స్పందన లేదని ఆవేదన చెందుతూ 11 వ తేదీన శనివారం రోజు చెత్త లారీల బంద్ కు పిలుపునివ్వడం అనేది ప్రజాస్వామికమైన నిరసన కార్యక్రమని అన్నారు. పై కార్యక్రమాన్ని ఎవరికి వారు స్వచ్ఛందంగా స్పందించి, చెత్త లారీల బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా అన్నివర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో అందరి మద్దతుతో జరుగుతున్న లారీల బంద్ కార్యక్రమాన్ని విచ్ఛినంచేసే కుట్రలో బాగంగా ఎలాంటి అరెస్టులకు పాల్పడిన, తప్పుడు కేసులకు గురిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జవహర్ నగర్ డంపింగ్యార్డు బాధిత ప్రాంతాల ప్రజలను మోసగించడమేనని అన్నారు. ఇప్పటికైన మేడ్చల్ ఎం.పి.గా ఉన్న సమయంలో మరియు రాష్ట్ర ఎన్నికలకు ముందు ఆతర్వాత జవహర్ నగర్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేనియెడల ప్రజా ఆందోళనలు తీవ్రతరమైతే, దానికి సంభదిత అదికారులు, ప్రభుత్వమే నైతిక భాద్యత వహించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. 10 నుండి 20 వరకు డంపింగ్ యార్డు సమస్యపై ప్రజా చైతన్య పాదయాత్రల కార్యక్రమం. ప్రజా చైతన్య పాదయాత్రల కార్యక్రమాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ సమావేశంలో కమిటీ గౌరవ సలహాదారుడు, మాజీ ఉపసర్పంచ్ ఆర్. నర్సింహ్మా గౌడ్, కో కన్వీనర్స్ సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ వి. ప్రవీణ్, పిఓడబ్ల్యు (విముక్తి) పెర్క సునీత, ఐ.ఎఫ్.టి.యు. పి.శివబాబు, పిడిఎం చంద్రమౌళి, బహుజన సత్త సింగరాయ గౌడ్ మరియు కమిటీ సభ్యులు బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకటేష్, పిఓడబ్ల్యు డి.స్వరూప, లక్ష్మీబాయి, పిఓడబ్ల్యు జయసుధ, ఫాతిమా తదితరులు పాల్గొని ప్రజలు డంపింగ్ యార్డు తొలగింపుకు జరుగుతున్న కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.





# పూర్తి భద్రతతో కూడిన 731 పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీతో రైతులు, ఆస్తికి భరోసా.

- **రైతులు, ఆస్తి వారి హక్కులను కాపాడడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం.**
- **2027 మార్చికి రెవిన్యూ సమస్యలు పూర్తిగా పరిష్కరించాలి**
- **గొడ్డలి పార్టీతో జాగ్రత్తగా ఉండండి ఆస్తి లాగేసు కుంటారు**
- **రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...**



**నూజివీడు, జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి):** చాట్రాయి మండలం పర్వతాపురం గ్రామములో రైతుల మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 731, మంది రైతుల, భూయజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పంపిణీ చేశారు. 90 శాతం పాసుపుస్తకాలు పంపిణీ చెయ్యడం జరిగిందని, మిగిలినవి త్వరితగతిన పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్ధరాత్రి అయిన మొత్తం పాసు పుస్తకాలు పంపిణీ చేసి వెళ్లాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రైతులు భూహక్కులు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని, అందుకు అనుగుణంగా సర్వేపూర్తి అయిన ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అధికారులు అలసత్వం, నిర్లక్ష్యం తొలగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెల ఒక గ్రామానికి వెళ్ళి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నారని, అదేవిధంగా రాష్ట్ర మంత్రులు కూడా పంపిణీ చెయ్యాలని ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రాష్ట్రంలో, నియోజవర్గం, గ్రామాల్లో వైసీపీ పార్టీవారు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు నమ్మరని, మనమంతా తిప్పికొట్టాలని అన్నారు. గత పాలకులు చిచ్చుపెట్టి భూవివాదాలు సృష్టించి, రికార్డులు తారుమారు చేశారన్నారు. గత ప్రభుత్వం ల్యాండు టైటిలింగు యాక్టు పేరిట ఓ నల్ల చట్టం తెచ్చి భూమి కాజేసేందుకు గత పాలకులు ప్రయత్నాలు చేశారని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూమి రికార్డులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. పాసు పుస్తకాల్లో గత పాలకులు తమ ఫోటో ముద్రిస్తే మన ప్రభుత్వం రాజ ముద్ర ముద్రించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ల్యాండు టైటిలింగు యాక్టును తక్షణం రద్దుచేసి భూమి యాజమాన్య హక్కుల్ని రక్షించామని అన్నారు. భూమి మీదైతే ఫోటోలు వారివి ముద్రించు కుని, పొలం సరిహద్దు రాళ్లపై కూడా బొమ్మలు ముద్రించు కున్నారని అన్నారు. రీ సర్వే చేయటంతో పాటు రైతుల్ని భాగస్వాములను చేసి వివరాలను తనిఖీ చేసి, ఈకేవైసీ చేశాక పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. తప్పులు లేకుండా పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి నెలా వచ్చి నేరుగా భూయజమానుల్ని, రైతులను కలిసి ఈ పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ చేసిన దుర్మార్గాన్ని పరిష్కరిస్తూ, భూ రికార్డులను ప్రక్షాళన చేసేందుకు 3 ఏళ్ల సమయం పట్టిందని అన్నారు. ఈ సందర్భంగా పట్టాదారు పాసు పుస్తకంలో గల క్యూఆర్ కోడ్ లను వివరిస్తూ వాటిని స్కాన్ చేసినట్లయితే పట్టాదారు వివరములు, భూమి వివరాలు విస్తీర్ణం, స్కెచ్ మరియు రూటు మ్యాప్, శాటిలైట్ ఇమేజి కూడా చూసుకొనవచ్చునని మంత్రి రైతులకు వివరించారు. రెవిన్యూ సమస్యలను 2027 మార్చికి పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు,మండల అభివృద్ధి అధికారి, వివిధ శాఖలు అధికారులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఐ,వెంకటేశ్వరరావు, గ్రామ సచివాలయం, రెవిన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, మండల, గ్రామ నాయకులు, రైతులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ జిల్లా గవర్నర్ కి ఘన స్వాగతం



**ఏలూరు, జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** లయన్స్ జిల్లా 316జి గవర్నర్ గా ఎన్నికైన విజయ స్కిన్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ దశిక సుబ్బారావు 3 జులై నుండి 7 జులై వరకు హాంగ్ కాంగ్ లో జరిగిన ఇంటర్నేషనల్ సమావేశంలో పాల్గొని లయన్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు మార్క్ ఎస్ లియోన్ నేతృత్వంలో జిల్లా గవర్నర్ గా ప్రమాణ స్వీకారం చేసి లయన్స్ ఇంటర్నేషనల్ సేవా ప్రణాళికలపై అవగాహన కల్పించుకొని గురువారం నాడు ఏలూరుకి తిరిగి వచ్చిన సందర్భంగా ఏలూరు గ్రీన్ సిటీ లో గల లయన్స్ భవనం నందు జిల్లా లయన్స్ నాయకులచే ఏర్పాటుచేసిన స్వదేశాగమన ఆత్మీయ ఆహ్వాన మరియు అభినందన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మన జిల్లాలో ఉన్న శాశ్వత ప్రాజెక్టులైన డయాలసిస్,కంటి హాస్పిటల్స్, జనరల్ హాస్పిటల్స్, కమ్యూనిటీ హాల్స్ వంటివి అత్యుత్తమ ప్రమాణాలతో నడుస్తున్నాయని, దీనికి కారకులైన మన జిల్లా పూర్వ గవర్నర్ లు ఇతర లయన్స్ అధికారులు,సభ్యులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే సేవారంగంలో ఈ సంవత్సరం కూడా మన జిల్లా ప్రతిభ నలుదిశలా వ్యాపింప చేసే విధంగా అందరం కలిసి కృషి చేద్దామని అన్నారు. ఈ సందర్భంగా పదవీ స్వీకరణ మహోత్సవం పూర్తి చేసుకొని వచ్చిన డాక్టర్ సుబ్బారావు,డాక్టర్ సరస్వతి దంపతులను లయన్స్ జిల్లా నాయకులు ఘనంగా సత్కరించారు. ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కూరపాటి సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి ఉప గవర్నర్ ఆర్.వి.ఎస్. సూర్యనారాయణ రాజు,రెండొవ ఉప గవర్నర్ వి.సత్య స్వరూప్, జిల్లా పూర్వ గవర్నర్ లు కె.వి కిషోర్ కుమార్,వి మురళీ మోహన్ రావు,డాక్టర్ పి విజయ భాస్కర్ రెడ్డి,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ ఎల్.వెంకటేశ్వరరావు,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ కె.బి.రావు, జిల్లా నాయకులు కూర్మా శ్రీనివాస్,డి.హేమసుందర్,కొరిపల్లి సత్యనారాయణ,వి. రత్నకుమార్, రీజియన్ చైర్మన్లు దేవరకొండ వెంకటేశ్వర్లు,పేరేచర్ల మురళీ కృష్ణంరాజు,పి.వెంకన్న బాబు, నాయకులు ఎం.శ్రీహరి,వి. విష్ణుకుమార్,జోన్ చైర్మన్లు వి.సురేష్,కడియం ప్రసాద్, శేషుకుమార్,స్థానిక నాయుకులు డి.రమాదేవి,ఎస్.సుజాత, శ్రీహరికోటి,బి.వి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియకు ప్రతి ఒక్కరు సహకరించాలి.

**సర్వసత్తాక గణతంత్ర ప్రజాస్వామ్యానికి... ఓటే వజ్రాయుధం. జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ పల్లపు రవి.**




**జవహర్ నగర్ జూలై 9: (వార్తా ప్రభ)** సర్వసత్తాక గణతంత్ర ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధమని ఓటు ద్వారానే ప్రజాస్వామ్యం పరిఢ విల్లుతుందని జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ పల్లకి రవి పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్, పరిధిలోని నాచారం ఫైర్ విక్టిమ్ కాలనీలోని అంగన్వాడి స్కూల్లో మాజీ కార్పొరేటర్ పల్లపు రవి ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ సందర్భంగా పల్లపు రవి మాట్లాడుతూ జవహర్ నగర్ లో అర్హులందరూ ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి భవన్ నాచారం బిఎల్వోలు అనసూయ, అనురాధ, కళావతి అనసూయమ్మ వెంకటేష్ నాచారం ఫైర్ విక్టిమ్ కాలనీ ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ జులై 10 న విద్యాసంస్థల రాష్ట్ర వ్యాప్త బంద్




**శేరిలింగంపల్లి,జూలై 9 (వార్తాప్రభ):** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏఐఎఫ్‌డీఎస్,ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. బంద్‌కు మద్దతుగా చందానగర్‌లోని దీప్తి శ్రీనగర్ నుంచి మియాపూర్ ఆల్విన్ ఎక్స్ రోడ్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీ పోస్టుల భర్తీ, మౌలిక వసతుల కల్పన, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలతో పాటు విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 10న జరిగే రాష్ట్రవ్యాప్త బంద్‌ను విద్యార్థులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## డంపింగ్ యార్డ్ విషయంలో... శాంతి భద్రతలకు విఘాతం కలిగితే చట్టపరమైన చర్యలు.

**జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి.**



**జవహర్ నగర్, జూలై 9: (వార్తా ప్రభ)** డంపింగ్ యార్డ్ విషయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి హెచ్చరించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ఏసిపి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వాట్సాప్ లలో సోషల్ మీడియాలో సర్కులేట్ అవుతున్న డంపింగ్ యార్డ్ కు సంబంధించి వాహనాలను ఆపుతామని చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తామని చెబుతున్న వారికి దీనికి సంబంధించి ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతమైనటువంటి నిరసన మాత్రమే చేయాలని ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసినా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినట్లయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా శాంతియుత మార్గంలో నిరసన తెలుపుకోవచ్చునని తెలిపారు. ఎవరైనా చట్టానికి అతీతంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సంపాదకీయం

## ట్రంప్ తగ్గరు... ఇరాన్ ని కెలికిన ఫలితం !

ఇరాన్ తో పెట్టుకున్నారు అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్. వెనిజులా అధ్యక్షుడిని అర్ధరాత్రి తన సొంత ఇంట్లో భార్యతో కలిసి నిద్రిస్తుండగా అమెరికా సైన్యం తీసుకొచ్చి ప్రపంచం ముందు ఘనతగా చెప్పుకుంది. అదే ఊపుతో ఉత్సాహంతో ఇరాన్ మీద కూడా విరుచుకుపడింది. పక్కన ఉన్న ఇజ్రాయెల్ ఇచ్చిన సలహాతోనో లేక ప్రపంచ విజేత కావడానికి ఇదే అదను అని భావించిందో తెలియదు కానీ ఇరాన్ తో పెట్టుకుంది. ఒక విధంగా చెప్పాలి అంటే ఇరాన్ కి కెలికింది. మొదటి రోజునే ఇరాన్ అధ్యక్షుడిని లేపేసి ఇక ఏముంది ఆ దేశం తమ వశం అనుకుంది. కానీ అక్కడే సీన్ రివర్స్ అయింది. అమెరికా అనుకున్నది ఒకటి అయితే జరిగింది వేరు అన్నది ప్రపంచం మొత్తం చూసింది. ఫిబ్రవరి నెలాఖరులో మొదలెట్టిన ఈ యుద్ధం ఇపుడు కంటిన్యూ చేయక తప్పేట్టు లేదని ట్రంప్ భావిస్తున్నారు అంటే ఆలోచించాల్సిందే మరి.ఈ మాట ట్రంప్ ఇప్పటికి అనేక సార్లు అన్నారు. మరోసారి ఆయన అదే అంటున్నారు. ఇరాన్ మొదటి టార్గెట్ తానేనని తాజాగా ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన మీద కుట్ర పన్ని హత్య చేసే అవకాశం ఇరాన్ తో ఉందని ఆయన చెబుతున్నారు. ఆయన అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇరాన్ ని వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ విషయం తీసుకుంటే 1979 నుంచి ఈ రోజు దాకా గత 47 ఏళ్లుగా ఆ దేశం వైఖరి ఏ మాత్రం మారలేదని తన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ టార్గెట్ లిస్ట్ లో తానే నంబర్ వన్ అని కూడా అన్నారు. ఇరాన్ తో చర్చలు అంటే టైం వేస్ట్ అని ట్రంప్ తేల్చేశారు. దాని వల్ల ఏ మాత్రం ప్రయోజనం కూడా లేదని అన్నారు. వారితో కాల్పుల ఒప్పందం చేసుకుంటే ప్రతీ రోజూ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారని ట్రంప్ ఫైర్ అయ్యారు. అందుకే ఇక కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని ఆయన చెప్పేశారు. ఇరాన్ తో చర్చలు కొనసాగించాలని చర్చల బృందం భావిస్తే కొనసాగించవచ్చని కానీ వాటిపై తనకు ఏ మాత్రం నమ్మకం లేదని ట్రంప్ పూర్తిగా అసహనం వ్యక్తం చెశారు. ఇదిలా ఉంటే తాజాగా అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో తమ సైన్యానికి చెందిన ఎనిమిది మంది సైనికులు మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా అధికారికంగా తెలిపింది. ఈ దాడులు దక్షిణ ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ అలాగే బుషెహర్ ప్రాంతాలలో జరిగాయని చెప్పుకొచ్చింది. ఒప్పందాని అమెరికావే ఉల్లంఘిస్తోంది అని కూడా ఇరాన్ విదేశాంగ శాఖ మండిపడుతోంది. ఇలా పరస్పరం దాడులకు సిద్ధపడడం తో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో వైపు చూస్తే అలీ ఖమేనీ అంత్యక్రియల సభలో అయితే ట్రంప్ ని చంపుతామని నినాదాలు చేస్తూ జనాలు హోరెత్తించారు. హత్యకు గురైన ఇరాన్ మాజీ సర్వోన్నత నాయకుడు అలీ ఖమేనీ విషయంలో ప్రతీకారంగా ఇరాన్ జనాలు ట్రంప్ ని చంపండి అని నినాదాలు చేస్తూ అమెరికా అధికారులపై ప్రతీకారం తీర్చుకుంటామని శపథం చేశారు.అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికి ట్రంప్‌ను హత్య చేసే లక్ష్యంతో ఇరాన్‌తో సంబంధం ఉన్న ఒక రహస్య కుట్రను అమెరికా న్యాయ శాఖ గతంలో భగ్నం చేసింది. అయితే ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ హత్య కుట్ర ఆరోపణలను అధికారికంగా తోసిపుచ్చి ఖండించినప్పటికీ అమెరికా గూఢచార సంస్థ ట్రంప్ కి వ్యతిరేకంగా వస్తున్న ఈ తరహా బెదిరింపులను నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉంది.

## పవన్ కళ్యాణ్ పై ఆరోపణలు చేయడం సూర్యుడికి టార్చి లైట్ వేయడమే!

**సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్**




**విజయవాడ పశ్చిమ జులై 9: (వార్తా ప్రభ ప్రతినిధి)** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై నిరాధారమైన ఆరోపణలు చేయడం సూర్యుడిపై టార్చ్ లైట్ వేయడమేనని సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాసేవలో నిమగ్నమై, నిబద్ధతతో పనిచేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మారుమూల మన్యం ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టి, గిరిజన ప్రాంతాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను, ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరిచారని ప్రశంసించారు. గత రెండు సంవత్సరాల పాలనలో ఎక్కడా అవినీతి మరక అంటకుండా, అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పరిపాలన సాగిస్తున్నారన్నారు. పవన్ కళ్యాణ్ నిజాయితీకి నిలువుటద్ద మనీ పేర్కొన్నారు. 2024 జూన్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ పాలనలో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని ఆకుల శ్రీనివాస్ వివరించారు. ఒకే రోజు 13,326 గ్రామసభలురాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామపంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి గ్రామస్థాయిలో ప్రజల అవసరాలను గ్రామసభ తీర్మానాల ద్వారా నమోదు చేశారనీ,ఈ కార్యక్రమానికి ప్రపంచస్థాయి గుర్తింపు లభించిందనీ పేర్కొన్నారు. అలాగే “పల్లె పండుగ” కార్యక్రమం ద్వారా గ్రామసభల్లో గుర్తించిన పనుల ఆధారంగా సుమారు ?4,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30,000 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీల స్వయం ప్రతిపత్తి కోసంక్లస్టర్ విధానాన్ని రద్దు చేసి ప్రతి గ్రామపంచాయతీని స్వతంత్ర పరిపాలనా యూనిట్‌గా బలోపేతం చేశారన్నారు.స్థానిక స్థాయిలో నిర్ణయాలు తీసుకునే అధికారాలను పెంచారన్నారు. పవన్ కళ్యాణ్ పాలనలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు ఐదు జాతీయ పంచాయతీరాజ్ అవార్డులు లభించాయని ప్రశంసించారు. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని 52 గ్రామపంచాయతీల్లో పాఠశాలలు, ఆసుపత్రులు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారని,తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తున్నారని ఆకుల శ్రీనివాస్ కొనియాడారు.గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. పరిపాలనా సంస్కరణల్లో భాగంగాగ్రామసభల ద్వారా ప్రజల భాగస్వామ్యం పెంచారని వివరించారు.నిధుల వినియోగంలో పారదర్శకత,పంచాయతీల ఆర్థిక బలోపేతం.గ్రామస్థాయిలో వేగవంతమైన నిర్ణయాల అమలు,కేంద్ర ప్రభుత్వ పథకాల సమర్థ వినియోగం పవన్ కళ్యాణ్ పాలనలో భాగమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తూకేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖతో సమావేశాలు నిర్వహించి గ్రామీణాభివృద్ధి, ఉపాధి, పంచాయతీ బలోపేతం కోసం అదనపు సహకారం కోరడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చేందుకు విశేష కృషి చేస్తున్నారని ఆకుల శ్రీనివాస్ ప్రశంసించారు.

## నొప్పిని తగ్గించే మందులు వైద్యుని సలహా లేకుండా వాడకూడదు

**జిజిహెచ్ సూపరిశీడెన్టెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్**




**గుంటూరు టౌన్ జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నేడు ప్రతి ఒక్కరూ శరీరంలో ఏ భాగంలో ఏ కొద్ది నొ ప్పి అనిపించిన వెంటనే పెయిన్ కిల్లర్స్- నొప్పిని తగ్గించే మందులు వాడడం సహజమైపోతుందని ,దీనివల్ల నొప్పులు తాత్కాలికంగా తగ్గిన, తర్వాత అనేక దుష్పరిణామాలు వస్తాయని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం ఉదయం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో లాఫింగ్ క్లబ్ సహకారంతో ఇండియన్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ పెయిన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ పెయిన్ పై నిర్వహించిన సభలో డాక్టర్ జి దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ఇండియన్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ పెయిన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎల్. మోహన్ భాస్కర్ అధ్యక్షత వహించారు. డాక్టర్ దుర్గాప్రసాద్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ పెయిన్ కిల్లర్స్ తాత్కాలిక ఉపశమనాన్ని ఇచ్చిన ,పెయిన్ కారణాలు నిరోధించలేవన్నారు. దీర్ఘకాల పెయిన్ బాధలకు నేడు అనేక ప్రత్యేక చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిజిహెచ్ మాజీ సూపర్ ఇండెండెంట్, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పని శారీరక వ్యాయామం ద్వారా అనేక రకాల నొప్పులను నియంత్రించవచ్చునన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ టి. సేవ కుమారు మాట్లాడుతూ నేడు చాలామందిలో శరీరం నొప్పులకు శారీరక వ్యాయామం లేకపోవడం, పోషకహార లోపమే ప్రధాన కారణమన్నారు. ముఖ్యంగా విటమిన్ బి12 ,విటమిన్ డి తగ్గిపోవటమే కారణమన్నారు. పోషకాహార లోపాలను సరి చేసుకోకుండా పెయిన్ కిల్లర్స్ వాడడం ఎంత మాత్రం మంచిది కాదన్నారు. పెయిన్ వైద్య నిపుణులు డాక్టర్ చావా మురలీకృష్ణ మాట్లాడుతూ దీర్ఘకాల పెయిన్ నిరోధంలో ఉపశమనానికి నేడు ఎన్నో కొత్త చికిత్స ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ మోహన్ భాస్కర్ మాట్లాడుతూ శరీరంలో పెయిన్ చాలామందిలో రోజువారి పనులకు, వృత్తులకు ఎంతో అంతరాయం కలిగిస్తుందని, దీనికి సరైన చికిత్స పొందడం ద్వారా జీవన ప్రమాణాలను, శ్రామిక శక్తిని మెరుగు పరుచుకోవచ్చునున్నారు. లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకులు లాల్ వజీర్ మాట్లాడుతూ తమ లాఫింగ్ క్లబ్ ద్వారా ఎంతోమంది సభ్యులకు ఆరోగ్యవంతమైన జీవన విధానానికి తోడ్పడుతున్నామన్నారు కార్యక్రమంలో డాక్టర్ పురుషోత్తం రెడ్డి, డాక్టర్ ఎం.హేమజ , డాక్టర్ మహేష్ , డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## కె బి ఎన్ కళాశాల్లో ఈ నెల16 నుంచి29 వరకూ అన్నమయ్య సంకీర్తనల ఉచిత శిక్షణ




**విజయవాడ పశ్చిమ జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తితిదే గాయకురాలు డాక్టర్ శోభారాజు ఆధ్వర్యంలో నిర్వహణవిజయవాడ, జులై 9: యువతకు అన్నమయ్య సంకీర్తనల సాహిత్య, సంగీత మాధుర్యాన్ని పరిచయం చేయడంతో పాటు ఆధ్యాత్మిక, మానవీయ విలువలను పెంపొందించేందుకు ఈనెల 16 నుంచి 29వ తేదీ వరకు ఉచిత అన్నమయ్య సంకీర్తనల శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు ఆర్. మల్లికార్జునరావు తెలిపారు. కెబిఎన్ కళాశాలలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాషా సాంస్కృతికశాఖ, కెబిఎన్ కళాశాల, అన్నమాచార్య భావన వాహిని సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శోభారాజు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ శోభారాజు మాట్లాడుతూ తాను స్వయంగా శిక్షణకు సంచాలకత్వం వహిస్తానని, శిబిరం ముగింపు సందర్భంగా ఈనెల 29న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.కెబిఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ టి. శ్రీనివాసు మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని, ఆసక్తి గల విద్యార్థులు, యువత ఉచితంగా పాల్గొనవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ శిక్షణ పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామని చెప్పారు.హిందూ హైస్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో మానవీయ విలువలు, సంగీతం, సాహిత్యంపై అభిరుచి పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఆసక్తి గల వారు 90320 44115, 92475 93201 నంబర్లలో సంప్రదించవచ్చని, SRClasses. Annama@gmail.com కు వివరాలు పంపించాలని నిర్వాహకులు తెలిపారు.సమావేశంలో కెబిఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణ, పి.ఎల్. రమేష్, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## సామాన్య భక్తుల సౌకర్యార్థం ఇంద్రకీలాద్రి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయం

**దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీ కె. రామచంద్ర మోహన్**







**విజయవాడ పశ్చిమ జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ కనకదుర్గమ్మ క్షేత్రమైన ఇంద్రకీలాద్రి సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కృతనిశ్చయంతో ఉందని, సామాన్య భక్తులకు మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే తమ మొదటి ప్రాధాన్యత అని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఆయన ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న పోటు (ప్రసాదశాల) అన్నప్రసాద భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ?జులై 15 లోపు ఇంద్రకీలాద్రి ‘మాస్టర్ ప్లాన్’ డ్రాఫ్ట్ నమూనా సిద్ధం కావాలి.?శ్రావణ మాసంలోగా నూతన లడ్డూ పోటు, అన్నదాన భక్తుల కోసం వినియోగం లోనికి తేవాలి. నిర్మాణ ?పనుల జాప్యం పై దేవాదాయ కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఎలివెటెడ్ క్యూ కాంప్లెక్స్ కింద వ్యాపార లావాదేవీలపై కమిషనర్ సీరియస్**

**దుకాణాలను తక్షణమే తొలగించాలని ఆదేశం.** భక్తులకు వీలయినంత స్థలాన్ని వినియోగం లోనికి తీసికొని రావటం కోసమే సదరు నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. అంతేకాని షాపులను ఏర్పాటు చేయడం కోసం కాదు అని దేవస్థానం సిబ్బందికి నిర్దేశించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఉన్నతాధికారులతో కలిసి ఆయన పనుల ప్రగతిని సమీక్షించారు.??ఈ సందర్భంగా కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ రాబోయే శ్రావణ మాసం నాటికి నూతన లడ్డూ పోటు, అన్నదాన భవనాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని దేవస్థానం అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే, ఇంద్రకీలాద్రి భవిష్యత్తు అవసరాలను దృష్టి లో ఉంచుకుని రూపొందిస్తున్న ‘మాస్టర్ ప్లాన్’ తుది నమూనాను జులై 15 లోపు సిద్ధం చేసి తమకు సమర్పించాలని ఆదేశించారు.

**వరుస పర్యవేక్షణలు చేస్తున్నా జాప్యమా?**

**ఇంజనీరింగ్ అధికారులపై అసంతృప్తి** .?క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా కమిషనర్ మొదట నూతన లడ్డూ పోటు నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు ఆశించిన స్థాయిలో వేగంగా జరగకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “నేను స్వయంగా ఇన్నిసార్లు పర్యవేక్షిస్తూ, దిశానిర్దేశం చేస్తున్నా ఇంకా పనులు కొనసాగుతూనే ఉండటం ఏమిటి?” అని ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు.రాబోయే దసరా నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని, యుద్ధప్రాతిపదికన రేయింబవళ్లు (24/7) షిఫ్టుల వారీగా పనులు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ భవనానికి వేసే రంగులు ఆహ్లాదకరంగా ఉండాలని పేర్కొంటూ రంగులు ఎంపిక చేసారు, లడ్డు పోటు ఫ్లోర్ నిర్మాణం పరిశీలన చేశారు.

నిధులు, సమయం వృథా చేస్తే సహించేది లేదు అని అన్నారు.


**అన్నదాన భవన పరిశీలన.** అనంతరం నూతన అన్నదాన భవనాన్ని పరిశీలించిన కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్, అక్కడ జరుగుతున్న పనులలో తగినంత వేగవంతంగా జరగటం లేదని అభిప్రాయ పడ్డారు. నిర్మాణ పనులు చేసేటప్పుడు వృధా వ్యయాన్ని అరికట్టాలని సూచించారు.ఇక్కడ జరిగే ప్రతి పని భక్తులకు 100% ఉపయోగపడేలా, అత్యంత నాణ్యతతో ఉండాలి. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రావణ మాసంలో ఈ రెండు భవనాలు ప్రారంభమై భక్తుల సేవకు వినియోగపడాలని అన్నారు.రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నాటికి నూతన పోటులోనే ప్రసాదం తయారీ, నూతన భవనంలోనే అన్నప్రసాద వితరణ జరగాలి. ఇది భక్తుల సౌకర్యాలకు సంబంధించిన విషయం, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని సహించం” అని కమిషనర్ చెప్పారు.

**క్యూ కాంప్లెక్స్ కింద దుకాణాల ఏర్పాటుపై కమిషనర్ ఫైర్**

**తక్షణమే తొలగింపునకు ఆదేశం:** భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు రూపుదిద్దుకుంటున్న ఎలివెటెడ్ క్యూ కాంప్లెక్స్ క్రింది భాగంలో కూల్ డ్రింక్ షాపులు, క్లోక్ రూమ్ మరియు ఇతర వాణిజ్య ఏర్పాట్లు చేయడంపై కమిషనర్ తీవ్రంగా మండిపడ్డారు. దీనిపై దేవాలయ అధికారులను అక్కడికక్కడే వివరణ కోరారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించిన స్థలాల్లో ఇలాంటి వ్యాపార ఏర్పాట్లు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వాటిని తక్షణమే తొలగించాలని ఆదేశించారు. “ఇంద్రకీలాద్రిపై ఉన్న ప్రతి అంగుళం స్థలం కేవలం భక్తుల అవసరాలకు, వారి సౌకర్యాలకే ఉపయోగపడాలి. అని అధికారులకు గట్టిగా హితవు పలికారు.?ఈ విస్తృతస్థాయి పర్యటనలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), డిప్యూటీ ఈవో శ్రీ కిషోర్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమతి రమ, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఆలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం..

**బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి.**



**విజయవాడ పశ్చిమ జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి అన్నారు.. ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు కాంతారావు ,34 వ డివిజన్, టీడీపీ , బీజేపీ, జనసేన పార్టీ అధ్యక్షులు అడ్డూరి కొండలరావు , ఆకుల రవి శంకర్, రుద్రపాటి వెంకటేష్ కూటమి నేతలతో కలిసి భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు..ప్రజలు వివిధ సమస్యలపై వినతులు సమర్పించారు.. వచ్చిన అర్జీలను స్వయంగా పరిశీలించి అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు.రాజకీయాలకతీతంగా , ప్రజాసేవే ధ్యేయంగా ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి తెలిపారు..కూటమి నేతలు పిళ్ళ శ్రీనివాసరావు, ప్రదీప్ రాజ్, దుర్బేసుల హుస్సేన్, నందకుమారి, విజయలక్ష్మి, సుభాషిణి, పితాని పద్మ, గాయత్రి, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు..

## కనగాల ఎస్టీ కాలనీలో ఇంటింటి ధర్మ ప్రచారం





**చెరుకుపల్లి మండలం జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జులై 1వ తేదీ నుండి15తేది వరకు జరుగుతున్న ఇంటింటి ధర్మ ప్రచారం టీటీడీ శ్రీ వాణి ట్రస్ట్ ఆర్థిక నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన కనగాల ఎస్టీ కాలనీలో శ్రీ విఘ్నేశ్వర స్వామి గుడి కమిటీ సభ్యులను కలుపుకొని గురువారం ఇంటింటి ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంస్కృతి ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కులభేదాలు లేని హిందూ ధర్మ సమాజ నిర్మాణానికి సంత్ రవిదాస్, ముమ్మడివరం బాలయోగి లను ఆదర్శంగా తీసుకోవాలని వారు సమాజంలోని అట్టడుగుట్ట వర్గాల జన్మించి యోగులుగా మారి హిందూ ధర్మంలోనున్న రుగ్మతలను తొలగించి హిందూ ధర్మ అభివృద్ధికి జీవితాంతం కృషిచేసి యోగులుగా గురువులుగా అనేకమంది చేత పూజింపబడ్డారని తెలియజేశారు. హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ ఇంటింటికి కరపత్రాలు ఇచ్చి ధర్మ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో , జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మండల కన్వీనర్ ఖండ్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ అర్చకులు కట్టా సుబ్బారావు , కట్టా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాజస్థాన్‌లో మైనర్ బాలికపై సామూహిక అత్యాచార ఘటనను ఖండిస్తూ మహిళా సమైక్య నిరసన

**నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్**

**మహిళల భద్రత విషయంలో ప్రభుత్వాలు బాధ్యత వహించాలి.**



**విజయవాడ పశ్చిమ జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాజస్థాన్‌లో 13 ఏళ్ల మైనర్ బాలికపై 30 మంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారనే ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య ఆధ్వర్యంలో గురువారం విజయవాడ వన్‌టౌన్ చేపల మార్కెట్ వద్ద నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో విజయవాడ నగర 53వ డివిజన్ మహిళా సమైక్య మహిళ నాయకులు వన్ టౌన్ చేపల మార్కెట్ సమీపంలోని సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి బంక ఝాన్సీ లక్ష్మి, నాయకురాలు కొరగంజి దుర్గమ్మ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు దేశానికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా చిన్నారులు కూడా అత్యాచారాలకు గురవుతున్న ఘటనలు సమాజానికి మచ్చగా నిలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిందితులను చట్టంలోని కఠిన నిబంధనల ప్రకారం వేగంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కోరారు. నిందితులకు కఠిన శిక్షలు విధించకపోతే మహిళలే పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేపడతారని, ప్రజా సంఘాలను ఐక్యం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని మహిళా సమైక్య నాయకులు హెచ్చరించారు. మహిళల గౌరవం, భద్రతకు భంగం కలిగించే ఘటనలపై రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నగర కార్యదర్శివర్గ సభ్యుడు కొట్టు రమణారావు సారథ్యం వహించారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు సమాజం మొత్తం అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.నిరసన కార్యక్రమంలో కొట్టు విజయలక్ష్మి, సుజాత, పొట్లూరి ఎల్లమ్మ, ఆర్. అచ్చమ్మ, ఆర్. లక్ష్మి తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు. అలాగే నారాయణ స్కూల్‌కు చెందిన విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో హాజరై మహిళల భద్రతకు మద్దతుగా నినాదాలు చేశారు.

ప్రజలందరూ బిఎల్ఓ లకు సహకరించండి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజలందరూ బిఎల్ఓ లకు సహకరించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)--2026 కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గంలోని ఫైజర్‌పేట, సెంట్రల్ నియోజకవర్గంలోని అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్, తూర్పు నియోజకవర్గంలోని పటమట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. బీఎల్‌వోలు నిర్వహిస్తున్న విధులు, ప్రజల స్పందన, ఫారాల సేకరణ పురోగతి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ మూడు నియోజకవర్గాల్లో ప్రతిరోజూ ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి సాధిస్తుండటం అభినందనీయమని అన్నారు. అయినప్పటికీ మిగిలి ఉన్న ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ వారికి ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతిరోజూ ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేలా అవసరమైన మార్గనిర్దేశం చేస్తూ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్‌లో మరింత పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజలు కూడా బీఎల్‌వోలు తమ ఇళ్లకు వచ్చినప్పుడు పూర్తి సహకారం అందించాలని, వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో ఏ. రవీంద్రరావు, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌వో వెన్నెల శ్రీనివాస్, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలేరమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**శంకుస్థాపన చేస్తున్న పులిమీ దంపతులు**



**అనుమసముద్రంపేట జూలై 9 (వార్తాప్రభ ప్రతినిధి)** ఏ ఎస్ పేట మండలం అనుమసముద్రం గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల ఉపాధ్యక్షుడు పులిమి సుధాకర్ రెడ్డి దంపతులు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ నాయకుడు మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చొరవతో శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో పోలేరమ్మ తల్లి గుడి నిర్మాణానికి శంకుస్థాపన పూజ చేసామన్నారు. దశాబ్దాల తరబడి రాళ్లు ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించుకుంటున్న ఇక్కడి గిరిజనులకు శాశ్వత ఆలయ నిర్మాణం చేపట్టడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయని అన్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ గిరిజనులైన తమను గుర్తించి తమ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి టిడిపి మండల నాయకులు పులిమి సుధాకర్ రెడ్డి,కి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# యూనివర్సిటీ డిగ్రీ ఫలితాలలో టి జె పి యస్ కళాశాల విద్యార్థుల విజయ దుందుభి



**గుంటూరు**, జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వారు విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ .బి .వి .హెచ్ కామేశ్వర శాస్త్రి తెలిపారు. బి బి ఏ కోర్స్ నందు షేక్ షరియాజ్ షరీఫ్, షేక్ నాజ్ ఇన్, బి సి ఏ కోర్స్ నందు కొర్ర పవన్, కలవ సుధీర్, బీకాం జనరల్ కోర్స్ నందు యాసం కీర్తి, షేక్ షమీల, బీకాం కంప్యూటర్ కోర్స్ నందు కొచ్చర్ల తేజశ్రీ, ముత్తి పోగు మధులిక, బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ కోర్స్ నందు ఆదిత్య, షేక్ రోహిత్ సమీర్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సు నందు పఠాన్ గౌస్య, ఆలా శ్రీ నాగ పావని, బిఎస్సి డైరీ సైన్స్ కోర్సు నందు రావులపల్లి రామకృష్ణ, మధకం సాయి ప్రసన్న, బీఎస్సీ డేటా సైన్స్ కోర్స్ నందు మద్దాలి లక్ష్మీ ప్రసన్న, షేక్ హుమారియా, బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ కోర్సు నందు షేక్ అబ్దుల్ రజాక్, షేక్ మస్తాన్, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్స్ నందు కనపర్తి విన్నీ, నల్లగొండ నరేష్, బీఎస్సీ ఫిజిక్స్ కోర్స్ నందు కొత్తం శెట్టి సుకుమార్, బత్తిన ప్రతిమ, బీఎస్సీ జువాలజీ కోర్స్ నందు చెందాక యామిని సాయి దుర్గ, వంకే లావణ్య విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు అందరినీ కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్,కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి బ్రహ్మం అభినందనలు తెలియచేశారు.

# ఉమ్మడి ఆస్తి కుటుంబ సభ్యులకు తెలియకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారు?



**విసన్నపేట** జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి) స్థానిక మండల పరిధిలోని పుట్రెల గ్రామపంచాయతీ పరిధిలోని వీర రాఘవపుర ంలో గాదే వరాలమ్మ, గాదె నారాయణ చనిపోయిన తర్వాత రక్తసంబంధికులకు తెలియకుండా సమిష్టి ఆస్తి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గాదె రమేష్ ఆరోపించారు. బంధువులైన ఎం సాంబయ్య, సుబ్బారావులు అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయాలని ఉన్నతాధికారులకు తాము ఫిర్యాదు చేయనున్నట్లు ముగ్గురు తెలియజేశారు. రక్తసంబంధితులకు తెలియకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**రాజన్న సిరిసిల్ల, జులై 09:** :(వార్తా ప్రభ ప్రతినిధి) వేములవాడ పట్టణంలోని 15వ వార్డు బాలనగర్ ప్రాథమిక పాఠశాలలో సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు.

# ప్రతిభకు ప్రోత్సాహం.....!

**● టెన్త్ టాపర్లకు నగదు పురస్కారాలు.... ● 32 మంది మెరిట్ విద్యార్థులకు రూ. లక్ష ఉపకార వేతనాలు అందజేసిన మోస్ట్ ప్రతినిధులు**







**మైలవరం జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** :మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ నుంచి 32 మంది మెరిట్ విద్యార్థులకు రూ. లక్ష ఉపకార వేతనాలుమైలవరం:విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ప్రోత్సాహం ఎంతో అవసరం అనీ, దీనివల్ల వారిలో పోటీతత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయనీ,సమాజంలో ఎంతో మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థుల కు సరైన సహాయం అందడం లేదనీ,అటువంటి వారిని గుర్తించి ప్రోత్సాహించడం ద్వారా వారిని ఉన్నత స్థాయికి చేర్చవచ్చున్న లక్ష్యంతో మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మైలవరం పట్టణంలోని ఎస్ఎస్కె పబ్లిక్ స్కూల్ ఆవరణలో గురువారం ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందనీయ సభ ఏర్పాటు చేశారు.ఈ సభలో మైలవరం మండల పరిధిలో ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన 32 మంది విద్యార్థినీ, విద్యార్థులకు మోస్ట్ ప్రతినిధులు నగదు బహుమతులు, ఉపకార వేతనాలు అందజేశారు.32 మంది ప్రతిభావంతు లైన విద్యార్థులకు కలిపి మొత్తం రూ.1,00,000 విలువైన ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. అలాగే మండల స్థాయి టాపర్లుగా నిలిచిన ఇద్దరు విద్యార్థులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ ప్రతినిధులు కాటమనేని వెంకటేశ్వరరావు,మండల విద్యాశాఖ అధికారి-2 లావుడియా బాలు, ఎస్ఎస్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ భావన, ట్రస్ట్ కార్యదర్శి జూలకంటి ప్రసాద్ లు మాట్లాడుతూ ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించడం సమాజం బాధ్యత అని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థులు విద్యలో మరింత ఉన్నత శిఖరాల ను అధిరోహించాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి అమీర్ హంజా, జమిలిరెడ్డి, మదర్ థెరిస్సా ట్రస్ట్ చైర్మన్ కోయ సుధ తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భారత్ టెక్స్-2026లో రాష్ట్ర చేనేత, జౌళి వైభవం ప్రదర్శన

**టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు, ఎగుమతుల లక్ష్యంగా ముందడుగు**




**న్యూఢిల్లీ / అమరావతి, జూలై 9:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ చేనేత, జౌళి, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. జూలై 14 నుంచి 17 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే భారత్ టెక్స్--2026లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పెవిలియన్‌ను ఏర్పాటు చేసి రాష్ట్రంలోని చేనేత, జౌళి, అపారెల్, గార్మెంట్ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను, ఎగుమతి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పనుంది.భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ హాల్ నంబర్--9, స్టాల్ నంబర్--9గూ5లో ప్రత్యేక పెవిలియన్‌ను ఏర్పాటు చేసింది. గత రెండు ఎడిషన్లలో విజయవంతంగా పాల్గొన్న అనుభవంతో ఈసారి మరింత విస్తృత స్థాయిలో రాష్ట్ర టెక్స్‌టైల్ రంగాన్ని ఆవిష్కరించనుంది.కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని చాంపియన్, ఆస్పిరేషనల్ జిల్లాలకు చెందిన 40 మంది పారిశ్రామికవేత్తలు, ఎగుమతిదారులు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు. వీరికి అంతర్జాతీయ కొనుగోలుదారులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యే అవకాశం లభించడంతో పాటు కొత్త వ్యాపార భాగస్వామ్యాలు, ఎగుమతి అవకాశాలు, ప్రపంచ మార్కెట్లపై అవగాహన పెంపొందే అవకాశం కలగనుంది.ఈ పెవిలియన్‌లో గుంటూరు టెక్స్‌టైల్ పార్క్, తారకేశ్వర టెక్స్‌టైల్ పార్క్, హరీష్ ఫ్యాషన్స్, ఆప్కో తమ ఉత్పత్తులు, తయారీ సామర్థ్యాన్ని ప్రదర్శించనున్నాయి. అలాగే మిగిలిన ప్రదర్శన స్థలంలో రాష్ట్రంలోని జౌళి పార్కులు, పెట్టుబడి అవకాశాలు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలు, ఒక జిల్లా--ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) ఉత్పత్తులు, జీఐ ట్యాగ్ ఉత్పత్తులు, సంప్రదాయ చేనేత క్లస్టర్లను ప్రదర్శించనున్నారు.రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆలోచనల మేరకు చేనేత ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావడం, నేతన్నలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, పారిశ్రామికవేత్తలకు కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా ఆధ్వర్యంలో రాష్ట్ర టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడుల ప్రోత్సాహం, పారిశ్రామికాభివృద్ధి, ఎగుమతుల విస్తరణకు శాఖ ఇప్పటికే కార్యాచరణ చేపట్టింది. భారత్ టెక్స్--2026లో ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యం అత్యంత ప్రభావవంతంగా ఉండేలా ఆయన పర్యవేక్షిస్తున్నారు.చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని చేనేత, జౌళి, వస్త్ర రంగాల బలాలను దేశ, విదేశీ కొనుగోలుదారులు, పెట్టుబడిదారులకు సమర్థవంతంగా పరిచయం చేసేలా వ్యక్తిగత పర్యవేక్షణ తో ఏర్పాట్లు చేశారు.భారత్ టెక్స్--2026లో రాష్ట్ర భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ రంగానికి ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు లభించడంతో పాటు కొత్త పెట్టుబడులు, ఎగుమతులు, మార్కెట్ అవకాశాలు పెరిగి రాష్ట్ర చేనేత, జౌళి రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డెక్కిన వన్నె చింతలపూడి కౌలు రైతులు...

**నారుమళ్లు వేయలేక రైతులు అయోమయం**



**అమలాపురం,** జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి) పంటపొలాలకు నీరుఅందక నారుమళ్లు వెయ్యలేకపోయామని, అధికారుల నిర్లక్ష్య వైఖరిని నివసిస్తూ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడిలో కౌలు రైతుల రోడ్డు ఎక్కారు. ప్రతి ఏటా జూన్ 12 నా కాలువ లోకి నీరు వచ్చేదాని, సరైన సమయం లో నీరు అందిచక పోవడం తో కౌలు రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఇమ్మిడివరప్పాడు, శెట్టిపల్లి,తాండవపల్లి వన్నె చింతలపూడి గ్రామాల కు, నీరు అందక కౌలు రైతులు ఆవేదన.తమకు వ్యవసాయమే జీవనాధామని, సరైన సమయంలో నీళ్లు అందించకపోతే క్రాప్ హాలీడ్ ప్రకటించడం తప్ప తమకు, వేరే దారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అప్పులు చేసి వ్యవసాయం చేస్తుంమని , నష్టాల బాటలో ఉన్నా సరే తమకు వ్యవసాయం మీద ఉన్న మొక్కువ తో వ్యవసాయాన్ని తమ వృత్తిగా ఎంచుకున్నామన్నారు.అధికారులు సాగునీటి విడుదలలో పక్షపాతం చూపుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు.ఒక పక్క నీరు లేక వన్నె చింతలపూడి రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరో పక్క చిందాడగరువు రైతులు మోటల్ లు సాయం తో నారుమళ్ళు వేస్తె,బీటలు కొట్టె పరిస్థితి ఏర్పడింది..దేశానికి రైతే రారాజు అనే మాట మాట్లాకే పరిమితమని ఆవేదన వ్యక్తం చేశారుసరైన సమయంలో నారుమళ్లువెయ్యేకపోతే వరి పంట నష్టాల పాలవుతుందన్నారు రైతులపై వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు ఇప్పటికైనా అధికారులు స్పందించి వరిచేలుకు నీలి అందించాలని లేనిపక్షంలో రైతులంతా కలిసి ఉద్యమని చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమం లో రైతులు పెయ్యాల సత్యనారాయణ, పరమట వసంతరావు, లంక సత్యనారాయణ,బాలయోగి, ప్రసాద్,సుదర్శన్,వెంకటేశ్వరావు,అత్తిలి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం బ్యాంకు అధ్యక్షుడు గంగ రాజ్‌కుమార్ యాదవ్





**తిరుపతి,** జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)తిరుమల తిరుపతి దేవస్థానముల (టీటీడీ) ఉద్యోగుల కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, తిరుపతి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గంగ రాజ్‌కుమార్ యాదవ్ తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించిన టీటీడీ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, బ్యాంకు డైరెక్టర్లు, సభ్యులు, సహచర ఉద్యోగులు, శ్రేయోభిలాషులు, ఆత్మీయ మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తన తొలి సంతకంతో టీటీడీ ఉద్యోగుల కో-ఆపరేటివ్ బ్యాంక్ సభ్యులకు రూ.3 కోట్ల 95 లక్షల డివిడెండ్ విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు 6,200 మంది సభ్యులు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు.తనపై సభ్యులు ఉంచిన విశ్వాసం, ప్రేమ, అభిమానాన్ని నిలబెట్టుకుంటూ బ్యాంక్ అభివృద్ధి, సభ్యుల ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా నిబద్ధతతో పనిచేస్తానని గంగ రాజ్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ, ప్రత్యక్షంగా హాజరై అభినందించిన వారికి, ఫోన్, సామాజిక మాధ్యమాలు తదితర మార్గాల ద్వారా శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారం, సూచనలు, ఆశీస్సులతో టీటీడీ ఉద్యోగుల కో-ఆపరేటివ్ బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు.

# వెల్దండలో కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం.

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.**




**ఎల్బీనగర్/ వార్తప్రభ( జూలై 9)**:కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు వెల్దండ పట్టణంలోని ఆకృతి గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాచమల్ల సిద్దేశ్వర్, కోఆర్డినేటర్ ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ పాల్గొని, పార్టీ బలోపేతం,సంస్థాగత కార్యక్రమాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. బీఎల్ఏలు, నాయకులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జనార్ధన్ రెడ్డి,ఎమ్మార్వో కార్తీక్ తదితర అధికారులు, మండల అధ్యక్షులు, ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలో పలు శుభకార్యాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు.

# పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీసీపీ బి. లక్ష్మీనారాయణ

**పెనుగంచిప్రోలు, జూ లై 9( వార్త ప్రభ )** ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట నియోజకవర్గం, పెనుగంచిప్రోలు స్టేషన్ లో తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన స్టేషన్‌లో డిసిపి బి. లక్ష్మీనారాయణ శాంతిభద్రతల పరిరక్షణ,భద్రతా ప్రమాణాల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. డీసీపీ లక్ష్మీనారాయణ స్టేషన్ పరిధిలో మరియు లోపల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును స్వయంగా చెక్ చేశారు. నిరంతరం నిఘా కొనసాగేలా చూడాలని ఆదేశించారు, పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులు, కేసుల డైరీలు మరియు పెండింగ్ ఫైళ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు.పెనుగంచిప్రోలు స్టేషన్ పరిసర ప్రాంతాల శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, మరియు స్థానిక భౌగోళిక అంశాలపై అధికారులతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు,ఈ తనిఖీ సందర్భంగా పెనుగంచిప్రోలు ఎస్సై అర్జున్ మరియు ఇతర సిబ్బందికి డీసీపీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ త్వరితగతిన న్యాయం చేయాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


**రూరల్ సీఐ చిరుమామిళ్ల వెంకట్**





**మంగళగిరి:**జులై 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబం ధనలు పాటించాలని, ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాల కు చేర్చాలని రూరల్ సీఐ చిరుమామిళ్ల వెంకట్ అన్నారు. గురువారం ఆయన తన సిబ్బందితో చినకాకాని వై జంక్షన్ వద్ద ఆటోల తనిఖీలు నిర్వహించి డ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ చిరుమామిళ్ల వెంకట్ మాట్లాడుతూ... ఆటోలో పరిమితికి మించి ప్రయాణ కులను ఎక్కించుకోవద్దని, డ్రైవర్ సీటు పక్కన కూర్చోరాదని అన్నారు. ఆటోను కండిషన్‌లో ఉంచుకునేలా చూసుకోవాల న్నారు. ఆటో డ్రైవర్ లు విధిగా యూనిఫామ్ ధరించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలన్నారు. ఆటోల సైడ్ డోర్లు, వెనుక డోర్లు తెరిచి ప్రయాణికులను కూర్చోబెట్టి ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఆటోకు అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయాణికులను ఫస్ట్ ఎయిడ్ నిమిత్తం ఆసుపత్రులకు తరలించి మానవత్వం చూపించాలన్నారు. ఆటోలకు హైఓల్టేజీ బల్బులు అమర్చి ఎదురుగా వచ్చే వారికి ఇబ్బందులు కలిగించ వద్దన్నారు. ప్రయాణికులు ఇబ్బందులకు గురైతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అక్షర సత్యాల సరాలు



సంతోషానికి మించిన
సంపద లేనే లేదు
ఆరోగ్యానికి మించిన
స్వర్గమే కానరాదు
సంతృప్తి నిండు బలము
జీవితాన స్వర్గ సుఖము
ఉంటేనే మేలు మేలు
ఈ భువిలో చాలు చాలు
అందరితో సమాధానము
అత్యంత ఆవశ్యకము
బాగుండదు సమాజాన
ప్రతి వారితో విరోధము
సజ్జనుల సహవాసము
నిరంతరం కోరుకొనుము
దుష్టుల మైత్రి బంధము
పరికింప హానికరము

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# ఘనంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అడపా బాబ్జీ 58వ జయంతి వేడుకలు

● పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన
మాజీ మంత్రి కొడాలి నాని.. అడపా పండు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం..



**గుడివాడ,జూలై 9 (వార్తాప్రభ) :** గుడివాడ మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ అడపా వెంకట రమణ (బాబ్జీ) 58వ జయంతి వేడుకలు గుడివాడలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి కొడాలి నాని పాల్గొన్నారు. ముందుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అడపా బాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి కొడాలి నాని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన బాబ్జీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అడపా బాబ్జీ తనకు వ్యక్తిగతంగా ఆప్తుడని, రాజకీయంగా కూడా తన ప్రస్థానంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. బాబ్జీ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని సూచించారు. అనంతరం ఏజీకే స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన అడపా బాబ్జీ విగ్రహానికి చేరుకున్న కొడాలి నాని అక్కడ కూడ పూలమాల వేసి నివాళులర్పించారు. అడపా బాబ్జి జయంతి కార్యక్రమం సందర్భంగా స్థానిక ఎజికే స్కూల్ సమీపంలో అడపా పండు ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కొడాలి నాని పేదలకు, బాటసారులకు భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలేటి చంటి, మెరుగుమాల కాళీ, ఎంపీపీ పేయ్యల ఆదాము, పొట్లూరి కృష్ణారావు, మట్ట జాన్ విక్టర్, కందుల నాగరాజు, అడపా జగదీష్, కొంకితల ఆంజనేయ ప్రసాద్, గంట శీను, అద్దేపల్లి పురుషోత్తం, చుండూరి శేఖర్, గిరి బాబాయ్, అల్లం రామ్మోహన్, రమణ కుమార్, గుదే రవి, కలపాల కిరణ్, వంగలపూడి కనక బాబు, జ్యోతుల మణికంఠ, కుమార్, తోట సాయి, సింహాద్రి రాంబాబు, ఎస్.కె బాజి, షేక్ సయ్యద్, రషీద్, జివస్టి భాష, కరీముల్లా, ఇబ్రహీం, ఖాదర్ బెగ్, అస్లాం, జ్యోతుల సత్యవేణి, సురేఖ, హారిక, రమీజా, కళావతి, సునీత, శేషం నిర్మల, రాణి తదితరులు పాల్గొన్నారు.

# రావణ్ వ్యవహారంపై మళ్లీ స్పందించిన కొడాలి నాని.. ఘాటు వ్యాఖ్యలు..

**గుడివాడ,జూలై 9 (వార్తాప్రభ) :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొడాలి నాని మరోసారి రావణ్ వ్యవహారంపై స్పందించారు. రావణ్ అసలు పేరు, మత గుర్తింపును టీడీపీ, అనుకూల మీడియా వక్రీకరించాయని ఆయన ఆరోపించారు. రావణు బెయిల్ రావడంలో వైసీపీ పాత్ర లేదని, ఈ అంశంలో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రావణ్ అరెస్టు, అనంతర పరిణామాలపై జనసేన, టీడీపీ వ్యవహార శైలిని కొడాలి నాని ప్రశ్నించారు. చిన్న సోషల్ మీడియా పోస్టులకే అరెస్టులు జరుగుతున్నాయని, అయితే రావణ్ విషయంలో భిన్నంగా ఎందుకు వ్యవహరించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిర్ణయాలు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కంటే ఇతరుల ప్రభావంతోనే జరుగుతున్నాయని కూడా ఆయన విమర్శించారు. మతాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేయవద్దని కొడాలి నాని సూచించారు. హిందువులు, క్రైస్తవులు సామరస్యంగా జీవిస్తున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం సామాజిక విభేదాలను రెచ్చగొట్టడం తగదని



అన్నారు. 2029 ఎన్నికల్లో పరుశురాముడు గొడ్డలితో జగన్, చంద్రబాబు ప్రభుత్వాన్ని, పార్టీని రాజకీయ సమాధి చేస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నాను. చంద్రబాబు ఇచ్చే కట్టెలు కొట్టడానికి కూడా పనికిరాని తుప్పు గొడ్డలి మాకెవరికి అవసరం లేదని ఎద్దేవా చేశారు.

## దాతల సహకారంతో శ్రీ స్వామి వారీ నివేదన శాల,
# ఆఫీసు రూమ్‌ల ఏర్పాటుకు తీర్మానం..




**గుడివాడ,జూలై 9 (వార్తాప్రభ) :** స్థానిక మెయిన్ రోడ్ లో వెంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం గురువారం ఉదయం చైర్మన్ సాయన రాజేష్ అధ్యక్షతన ఈఓ వై. శ్రీనివాసరావు సమక్షములో జరిగిన సమావేశంలో దేవస్థానం జమా ఖర్చులు ది 10-06-2026 నుండి ది 09-07-2026 వరకు క్షుణ్ణంగా పరిశీలించి అమోదించి యున్నారు. మరియు దేవాలయం వెనుక దక్షిణం వైపు స్వామి వారి నివేదనశాల మరియు ఆఫీస్ రూమ్ దాతల సహాయ సహకారములోతో నిర్మాణం చేయుటకు తీర్మానించి యున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు లోయ వాసు, పంచమర్తి శ్రీనివాసరావు, ముళ్ళపూడి రమణమూర్తి, వీరమాచినేని శైలజ, విక్కుర్తి పోతురాజు, చాపరాల విజయలక్ష్మి, సాసుపల్లి శారద, గొంతు పులి కనకదుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

**ఈనెల 15వ తేదీన హుండీల లెక్కింపు..** గుడివాడ పట్టణంలో బంటుమిల్లి రోడ్ లో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానము లో ది 15.7.26 బుధవారం ఉదయం 10 గంటలకి దేవాదాయ శాఖ అధికారులు. భక్తులు. అర్చక స్వాములు సమక్షంలో హుండీలు లెక్కించ బడునని ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ & ఆలయ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు సాంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనవచ్చునని సదరు ప్రకటనలో వారు పేర్కొన్నారు.

# వాసవీ -వనితా విధర్బపురీ వారీచే ఉచిత దుస్తుల పంపిణీ




**గుడివాడ,జూలై 9 (వార్తాప్రభ) :** వాసవి క్లబ్ మరియు వనితా విధర్బపు రీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "డాన్ టు డస్క్" సేవా కార్యక్రమాలలో భాగంగా పేద విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి వాసవి క్లబ్ కమిటీ సభ్యురాలు వల్లంకొండ రమాదేవి స్పాన్సర్‌గా వ్యవహరించారు. స్థానిక ఎస్‌పిఎస్ హైస్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షురాలు వేముల అనసూయ, ఉపాధ్యక్షురాలు వరదా రజిని, కమిటీ సభ్యురాలు బొగ్గరపు పద్మావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దుస్తులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ వాసవి క్లబ్ సభ్యులకు, స్పాన్సర్ వల్లంకొండ రమాదేవి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మైలవరంలో నేడు కిసాన్ ఘోష్టి

-వ్యవసాయ శాఖ అధికారిణి సంధ్యా రాణి

**మైలవరం,జూలై 9 (వార్తాప్రభ) :** ఈ నెల 10వ తేదీన మైలవరం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో కిసాన్ ఘోష్టి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కె.సంధ్యా రాణి గురువారం తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వ్యవసాయ రంగానికి సంబంధించి ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై వ్యవసాయ నిపుణులు రైతులకు అవగాహన కలిగించడం జరుగుతుందని ఏవో వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆమె కోరారు.

# పురందరేశ్వరిని కలిసిన సీఎల్ వెంకట్రావు...



**గుడ్లవల్లేరు,జూలై 9 (వార్తాప్రభ) :** రాష్ట్ర భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకురాలు దగ్గుపాటి పురందరేశ్వరిని ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ సీఎల్ వెంకట్రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెతో పార్టీ అభివద్ధి అంశాలపై ఆయన మాట్లాడారు. డాక్టర్ సీఎల్‌తో పాటు పాపయ్య ఉన్నారు.

# బి.వి.పి ఆధ్వర్యంలో రైన్ సూట్స్ పంపిణీ



**గుడివాడ,జూలై 9 (వార్తాప్రభ) :** 27-6-26 నుండి 10-7-26 వం-కు జరుగుచున్న "పఖ వాడ" కార్యక్రమములో భాగంగా 13 వ రోజైన బుధవారము మధ్యాహ్నం కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, చీదెళ్ల బసవేశ్వర రావు -లక్ష్మి దంపతులు, భారత్ వికాస్ పరిషత్ సభ్యుడు, మొదలగు వారి సౌజన్యంతో ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ విగ్రహము వద్ద, స్టేడియంలో పనిచేయుచున్న 16 మంది జెంట్స్ ఉద్యోగస్తులకు "రైన్ సూట్స్" పంపిణీ కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం జాయింట్ సెక్రటరీ కే. రంగ ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసినారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సామి రామ్మోహన్ రావు, కార్యదర్శి కటకం తిరుపాల్ గుప్తా, ఆర్థిక కార్యదర్శి పెద్దింటి రాధాకృష్ణ, అమరావతి ప్రాంత కన్వీనర్ కొమ్ము వెంకటేశ్వర్లు, బొగ్గరపు తిరుపతయ్య, జ్ఞాన్ చంద్ జైన్, వడ్లమూడి శిరోమణి, ఆలీ, మనోజ్ కుమార్ జైన్ మరియు దాతలు కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, చీదెళ్ల బసవేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానసాయికి భక్తుల రద్దీ...



**గుడ్లవల్లేరు, జూలై 9 (వార్తాప్రభ) :** శ్రీ జ్ఞానసాయి దర్శనానికి భక్తుల రద్దీ అధికమైంది. గురువారం వేకువజామునే మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీకుమారి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు విశేషాభిషేకాలను చేపట్టారు. అనంతరం సాయికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయ ప్రసాద్, నాగవల్లి, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనే భద్రమైన భవిష్యత్తుకు తొలి అడుగు

-పోలీసు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన వీరవల్లి ఎస్.ఐ. సత్యం సురేష్




**హనుమాన్ జంక్షన్,జూలై 9 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వీరవల్లి జడ్పీ హైస్కూల్‌లో వీరవల్లి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. సత్యం సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీసు శాఖ అమలు చేస్తున్న వివిధ చట్టాలు, భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. సత్యం సురేష్ విద్యార్థులకు డయల్-112 అత్యవసర సేవలు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలు, మహిళల భద్రత, శక్తి యాప్ ప్రయోజనాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే "మాదకద్రవ్యాల దుష్పరిణామాలు" వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అలాగే మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు, బెదిరింపులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా నేరాలను నివారించడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. సత్యం సురేష్ మాట్లాడుతూ, కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్, ఆదేశాల మేరకు గన్నవరం డీఎస్పీ మరియు హనుమాన్ జంక్షన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మార్గదర్శకత్వంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల మాట్లాడుతూ, సమాజంలో మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీసు శాఖతో ప్రజలు సహకరించి సురక్షిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు.

# పర్యావరణ ప్రజా అభిప్రాయ సేకరణ సదస్సు ఏర్పాటు

● కాలుష్య నివారణ సూచనలు ● పరిమితికి లోబడి డ్రిల్లింగ్ చేయాలి జేసీ అపూర్వ భరత్



**రౌతులపూడి,జూలై 9 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలం లో పర్యావరణ ప్రజాభి సేకరణ సదస్సు ఏర్పాటు చేశారు కాలుష్య నియంత్రణ మండలి ద్వారా డ్రిల్లింగ్ పై తదితర అంశాలపై జెసి భరత్ మరియు ఆర్డీవో కృష్ణమూర్తి అధ్యక్ష తన ఆంధ్రప్రదేశ్ కాలుష్యం అధికారి సూర్య కళ తరఫున వారికి సర్వే నెంబర్ 1 లో చిన్న మల్లాపురం గ్రామంలోసత్యా ఇంజనీరింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వారికి 7.282 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్ మెటల్ క్వారీ లీజును కాకినాడ జిల్లా మరియు భూగర్భ శాసన అధికారులు సత్య ఇంజనీరింగ్ అండ్ కన్స్ట్రక్షన్ పేరుతో క్వారీ లీజును 30 సంవత్సరాల కాలానికి అనుమతి మంజూరు చేయబడింది రెండు సర్వే నెంబర్ 1 లో ములగపూడి గ్రామం రోడ్డు మెటల్ అండ్ బెస్ట్ రెండు పాయింట్ జీరో ఎకరాలు విస్తీర్ణంలో బిల్డెస్ట్ క్వారీ లీజును కాకినాడ జిల్లా శాస్త్ర అధికారి ద్వారా దరఖాస్తు చేసుకోగా 15 సంవత్సరాల కాలానికి అనుమతి మంజూరు చేయబడింది అలాగే ఎస్ పైడిపాల లక్ష్మీ దుర్గ స్టోన్ క్రషర్ సర్వే నెంబరు 15లో ఉన్న ఈ మూడు మైనింగ్ క్వారీలకు కాలుష్యం మండలి ద్వారా పర్మిషన్మంజూరు దక్కించుకుంది ఈ కార్యక్రమానికి మండల ఎమ్మార్వో నరేష్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ఆయాగ్రామ రైతులు పాల్గొన్నారు ఆయా గ్రామ ప్రజలు తమ తమ సమస్యలను ప్రభుత్వ అధికారులకు తెలియజేసి ఈ కోరీలకి పర్మిషన్ ఇవ్వడంలో మాకు ఎటువంటి అభ్యంతరం లేదని తద్వారా ఈ దగ్గరలో ఉన్న గ్రామ రైతులకు తగిన విధంగా ఎటువంటి భయాందోళన కలిగించకుండా పరిమితికి లోబడి ఈ మైనింగ్ కార్యలను నడిపించవలసిందిగా అలాగే దగ్గరలో ఉన్న గ్రామాలులో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించవలసిందిగా ఆయా గ్రామ ప్రజలు తమ సమస్యలను చెప్పి తెలిపారు ఆయా గ్రామ ప్రజల రైతుల యొక్క సమస్యలు ప్రభుత్వ అధికారి వారికి మరియు ఆర్డీవో శ్రద్ధగా విని సమావేశం సజావుగా సాగించారు ఎటువంటి అవరోధాలు లేకుండా ఈ సర్వే నెంబర్ యొక్క కిందన రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా తమ విధి విధానాలతో ముందుకు వెళ్లాలని తద్వారా పరిమితికి లోబడి డ్రిల్లింగ్ చేయాలని డైలీ వాటర్ పోలింగ్ చేయాలని నిరుద్యోగులకు అవకాశం తో పాటు ప్రభుత్వం ద్వారా వచ్చినటువంటి ఇన్సూరెన్స్ ను చేయించాలని ఆయా సంస్థల యాజమాన్యానికి జెసి భరత్ మరియు ఆర్డీవో కృష్ణమూర్తి తెలియజేశారు వీటికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ప్రభుత్వం తరఫున తీసుకుంటామని అలాగే ఈ ప్రజా సమస్యలు రికార్డ్ ద్వారా తీసుకున్నామని వీటన్నిటిని పరిణయం తీసుకొని పై అధికారులకు తెలియజేసి సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమానికి సత్రం చైర్మన్ ఎస్ మౌళి జడ్పిటిసి దిమానం గొల్లు రమణ జిగిరెడ్డి సత్తిబాబు ఆయాగ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఏపీఎయిమ్స్‌తో రైతుకు స్మార్ట్ సేవలు

● యాప్‌ను ప్రతి రైతు వినియోగించాలి ● ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత
● ఉద్యాన, స్వల్పకాలిక వరి, అంతర పంటలకు ప్రాధాన్యం ● జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ





**ఏ. కొండూరు,జూలై 9 (వార్తాప్రభ) :** ఏపీ వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ (ఏపీఎయిమ్స్) యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకుని సమగ్ర వ్యవసాయ సేవలను పొందాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. గురువారం ఎ.కొండూరు మండలం చీమలపాడులోని ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. ఆన్‌లైన్ విధానంతో ఎరువులు సరైన సమయంలో, సరైన పరిమాణంలో పారదర్శకంగా అందుతున్నాయని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. తమ మొబైల్ ఫోన్లకు సంక్షిప్త సందేశాలు కూడా అందుతున్నాయన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎయిమ్స్ యాప్ ద్వారా రైతులకు వాతావరణ సూచనలు, మార్కెట్ ధరలు, పంటలపై నిపుణుల సలహాలు, వ్యవసాయ శాఖ తాజా సమాచారం తదితర సేవలను మొబైల్‌లోనే అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రతి రైతు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని కోరారు. పంటల వివరాల ఆధారంగా అవసరమైన మేరకే ఎరువులు అందించడం వల్ల ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత సాధ్యమవుతోందన్నారు. ప్రతి ఎరువుల దుకాణంలో ప్రత్యేక సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ నంబర్ 91549 70454 లేదా స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఉద్యాన పంటలు, స్వల్పకాలిక వరి రకాలు, అంతర పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ సూచించారు. దీంతో నీటి వినియోగం తగ్గడంతో పాటు పంట నష్టాల ప్రమాదం తగ్గి మెరుగైన దిగుబడి, ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు.

# అన్న క్యాంటీన్లలో నాణ్యమైన సేవలే లక్ష్యం

● కృష్ణలంక అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
● ఆహార నాణ్యత, పరిశుభ్రత, లబ్ధిదారులకు అందుతున్న సేవల పరిశీలన




**విజయవాడ,జూలై 9 (వార్తాప్రభ) :** విజయవాడ అర్బన్ పరిధిలోని కృష్ణలంకలో ఉన్న అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, భోజనం వడ్డించే విధానం, లబ్ధిదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌కు వచ్చిన లబ్ధిదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని ప్రతి లబ్ధిదారునికి అందిస్తున్నట్లు తెలిపారు. అన్న క్యాంటీన్ కార్యకలాపాలపై నిరంతరం పర్యవేక్షణ ఉంటోందని వెల్లడించారు. క్యాంటీన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అన్ని ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అన్న క్యాంటీన్ల ద్వారా సామాన్య ప్రజలకు నాణ్యమైన భోజనం అందించడం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని, సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ఫీడ్బ్యాక్ అందించే విధానాన్ని కూడా పరిశీలించారు.

# ప్రజాకేంద్రిత పాలనలో ఎన్టీఆర్ జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు

...జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ శ





**విజయవాడ, జూలై 9 (వార్తాప్రభ) :** ప్రజాకేంద్రిత పాలన, గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, పర్యావరణ పరిరక్షణ, వినూత్న కార్యక్రమాల అమలులో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. 2025, 2026 సంవత్సరాల్లో జిల్లాలోని ముప్పాళ్ళ, నిడమానూరు, అంబాపురం, గొల్లపూడి, గుంటుపల్లి, గూడవల్లి గ్రామపంచాయతీలు సహా మొత్తం తొమ్మిది గ్రామపంచాయతీలు గ్రామపంచాయతీ అవార్డులు అందుకున్నాయని తెలిపారు. అలాగే "వికాస్ సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ -- ఎన్టీఆర్ వికాస్" కార్యక్రమానికి 2025లో స్కోచ్ సిల్వర్ అవార్డు, "ఇగ్నైట్ సెల్" కార్యక్రమానికి 2026లో స్కోచ్ గోల్డ్ అవార్డు లభించాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌కు హరితీకరణ, పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు చర్యలు, ప్రజా సేవల నాణ్యతకు గుర్తింపుగా మూడు ఐఎస్ఓ సర్టిఫికెట్లు లభించాయని తెలిపారు. అలాగే ఎకో ఫ్రెండ్లీ గణేష్, యోగాంధ్ర--2025 కార్యక్రమాలకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు, యోగా ప్రాచుర్యానికి వరల్డ్ రికార్డ్స్ యూనియన్ సర్టిఫికెట్ లభించడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. ఈ అవార్డులు జిల్లా యంత్రాంగం సమిష్టి కృషి, ప్రజాప్రతినిధుల సహకారం, ప్రజల భాగస్వామ్యానికి దక్కిన గుర్తింపని పేర్కొన్న కలెక్టర్, భవిష్యత్తులోనూ పారదర్శక, సమర్థవంతమైన ప్రజా పరిపాలనతో ఎన్టీఆర్ జిల్లాను దేశానికి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ అవార్డులను గురువారం కలెక్టరేట్ లో ఇంచార్జి మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ పరిశీలించి కలెక్టర్ కు, టీం ఎన్టీఆర్ కు అభినందనలు తెలిపారు.

# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి: ఐఏఎల్ డిమాండ్

● తిరుపతి కోర్టు ఆవరణలో న్యాయవాదుల భారీ ధర్నా.



**తిరుపతి, జూలై 9 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం "న్యాయ వాదుల రక్షణ చట్టాన్ని" వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేస్తూ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ.ఏ.ఎల్.) చిత్తూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ రోజు తిరుపతి కోర్టు ఆవరణలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సంఘం నాయ కులు పాల్గొని న్యాయవాదులకు రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఐ. ఏ.ఎల్ రాష్ట్ర కార్యదర్శి వై.ఎస్. యాదవ్ మాట్లాడుతూ "న్యాయవాదులు ఎలాంటి బెదిరింపులకు, దాడులకు భయపడకుండా స్వేచ్ఛగా తమ వృత్తిని నిర్వహించడానికి మరియు బాధితుల పక్షాన బలంగా పోరాడటానికి ఈ చట్టం ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. న్యాయవాదులకు నిర్భయమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ కనీస బాధ్యత," అని వై.ఎస్.యాదవ్ స్పష్టం చేశారు. ఐ.ఎల్.ఎల్. ఉపాధ్యక్షులు యోగానంద్ మాట్లాడుతూ "ఇటీవల కాలంలో విధి నిర్వహణలో ఉన్న న్యాయవాదులపై భౌతిక దాడులు, బెదిరింపులు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. వీటిని కఠినంగా అరికట్టి, వారిపై దాడికి పాల్పడే నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా చేయడానికి ఒక ప్రత్యేక చట్టం అత్యవసరమన్నారు. పెరుగుతున్న దాడుల నియంత్రణకు ఈ చట్టమే ఏకైక మార్గం," అని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు రాజమాణిక్యం ప్రసంగిస్తూ "కొన్నిసార్లు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా లాయర్లపై అక్రమ కేసులు బనాయించడం, వేధింపులకు గురిచేయడం జరుగుతోంది. వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించే న్యాయవాదులకు ఇలాంటి ప్రతీకార చర్యల నుండి చట్టబద్ధమైన భద్రత కల్పించాలన్నారు. తప్పుడు కేసుల నుండి న్యాయవాదులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది," అని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కరుడు మాట్లాడుతూ "న్యాయవాదులు సురక్షితంగా, స్వేచ్ఛగా పనిచేయగలిగితేనే న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుంది. లాయర్లకు రక్షణ కల్పించడమంటే, పరోక్షంగా సామాన్యుడికి న్యాయం అందేలా చూడటం మరియు ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే. ఇది కేవ లం న్యాయవాదుల భద్రత మాత్రమే కాదనీ, న్యాయవ్యవస్థ మనుగడకు సంబంధించిన అంశం," అని వివరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో చిత్తూరు జిల్లా నలుమూలల నుండి వచ్చిన న్యాయవాదులతో పాటు, తిరుపతి బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

# కొత్త యాప్ వద్దు... పాత పద్ధతే ముద్దు.. రైతు సంఘం నాయకులు..




**కృత్తివెన్ను,జూలై 9 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండల రైతు సంఘ సమావేశం మలిశెట్టి శివరాం ప్రసాద్ అధ్యక్షతన బంటుమిల్లి లోని గుండాబత్తల ఆంజనేయులు భవనంలో గురువారం జరిగింది .ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు రైతాంగ సమస్యలు కర్తవ్యాలపై మాట్లాడడం జరిగింది .ఈ సమావేశంలో ఈమధ్య కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన యాప్ వల్ల రైతులు, కౌలు రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ప్రభుత్వం ఈ యాప్ ని రద్దుపరిచి ,పాత విధానంలోనే రైతులకు కౌలు రైతులకు సరిపోవు ఎరువులను అందించాలని బంటుమిల్లి మెయిన్ కాల్వ పరిధిలో సాగునీరు విడుదల చేసి వరి పంట పొలాలను కాపాడాలని కోరుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే ప్రీమియాన్ని భరాయించి సమగ్ర ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని మరియు ప్రభుత్వ బీమా సంస్థలకు అవకాశం యిచ్చి ప్రోత్సహించాలని కాపాడాలని కోరుతూ ఆక్వారంగాన్ని వ్యవసాయంగా గుర్తించి ఆదుకోవాలని, కంపెనీలు పెంచిన ఫీడ్ ధరలు తగ్గించాలని కోరుతూ, రాష్ట్ర ప్రభుత్వం మొంతోతుఫాన్ నష్టపరిహారాన్ని వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కోరుతూ రైతులు కౌలు రైతులు బ్యాంకుల నుండి తీసుకున్న వ్యవసాయ రుణాల అప్పు తాల్కు వడ్డీ ని కేంద్ర ప్రభుత్వం మూడు శాతం భరాయిస్తుంది, మిగతా నాలుగు శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరాయించి 0 వడ్డీ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ తీర్మానాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధనరావు, నాదెళ్ల సుబ్రహ్మణ్యేశ్వర రావు, రైతులు కంఠమనేని మురళి మోహన్ రావు, సూదాబత్తుల సత్యనారాయణ, గౌరిశెట్టి రంగారావు ,కైలా రాము, యడ్లపల్లి పెద్దిరాజులు, బొడ్డు నాగరాజు ,సుంకర వెంకన్న, నాగిశెట్టి వెంకన్నబాబు, గౌరిశెట్టి నారాయణ , వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# స్త్రీ శిశు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

-అంగన్వాడీ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**కోడూరు,జూలై 9 (వార్తాప్రభ) :** స్త్రీ శిశు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం కోడూరు మండలం హంసలదీవిలో ఉపాధి హామీ నిధులు రూ.5లక్షలు, ముడా నిధులు రూ.10లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ స్కూల్ పరిశీలించి, విద్యార్థుల పఠనా సామర్థ్యం పరీక్షించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎన్.రాణి, ఎంపీడీఓ సుధాప్రవీణ్, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ పగడాల సురేష్ బాబు, ఎంఈఓ టీవీఎం రాందాస్, ఐసీడీఎస్ సీడీపీఓ మహమ్మద్ షెహనాజ్ బేగం, చేబోయిన వెంకట కృష్ణారావు, జనసేన పార్టీ కోడూరు టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, చేబోయిన సుధాకర్, వడుగు పాండు, అప్పికట్ల వినోద్, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## డోకిపర్రు శ్రీ వేంకటేశ్వరుని సన్నిధికి...

# ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం...



**గుడ్లవల్లేరు,జూలై 9 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతుల చేతుల మీదుగా గురువారం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు తెలియజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇప్పటికే పదుల సంఖ్యలో మెయిల్ ద్వారా ఉచిత బస్సులను భక్తుల సౌకర్యార్థం మెయిల్ అధినేత క్రిష్ణారెడ్డి నిర్వహిస్తున్నారు. అలాగే శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ట్రస్ట్ ద్వారా భక్తుల సేవలో ఈ ఉచిత బస్సు సేవ చేపట్టినట్లు బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు చెప్పారు. నిడుమోలు నుంచి డోకిపర్రు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, డోకిపర్రు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి కౌతవరం వరకు భక్తులు మరియు ప్రయాణికుల సౌకర్యార్థం ఉచిత బస్సు సేవ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సేవను అందరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా మనవి చేశారు. 'సేవే పరమో ధర్మః -- భక్తుల సేవే శ్రీహరి సేవ'గా భావిస్తున్నామని చెప్పారు. 'భక్తి ఉన్న చోట సేవ ఉంటుంది... 'సేవ ఉన్న చోట శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహం ఉంటుంది' అని పేర్కొన్నారు. ఈ 'ఉచిత ప్రయాణం -- భక్తులకు ఆనందం, కలుగజేస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు సదా భక్తులతో ఉండాలి' అని శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ట్రస్ట్ తరపున కోరుతున్నామని నిర్వాహకులు బాపిరెడ్డి, భాస్కరమ్మ కోరారు.


# టీవీఎస్ ద్విచక్ర వాహనాల ద్వితీయ షోరూమ్ ప్రారంభం

● వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తాం ప్రాంతీయ మేనేజర్ సుప్రీత్ సింగ్



**అమలాపురం,జూలై 9 (వార్తాప్రభ) :** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ టీవీఎస్‌కు చెందిన నూతన షోరూమ్ ఘనంగా ప్రారంభమైంది. ఆధునిక సౌకర్యాలతో ఈదరపల్లి దిగువన ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడంతో అమలాపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు అన్ని రకాల టీవీఎస్ ద్విచక్ర వాహనాలు ఒకే చోట లభించనున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టీవీఎస్ ప్రాంతీయ మేనేజర్ సుప్రీత్ సింగ్, టీవీఎస్ ప్రాంతీయ విభాగ మేనేజర్ రవి వంశీకృష్ణ, టీవీఎస్ ప్రాంతీయ సేవల మేనేజర్ రోనాల్డ్ రాబర్ట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సి.ఎం.ఆర్ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం చందన మోహన్‌రావు, నెల్లి కిషన్ తదితరులు అతిథులను ఘనంగా సన్మానించి శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ మేనేజర్ సుప్రీత్ సింగ్ మాట్లాడుతూ టీవీఎస్ సంస్థ భారతదేశంలో అగ్రశ్రేణి ద్విచక్ర వాహనాల తయారీ సంస్థగా ఎదిగి కోట్లాది మంది వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించిందన్నారు. నాణ్యత, అత్యాధునిక సాంకేతికత, భద్రత, ఇంధన పొదుపు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త తరహా వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తూ దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతోందని తెలిపారు. ప్రాంతీయ విభాగ మేనేజర్ రవి వంశీకృష్ణ మాట్లాడుతూ సాధారణ మోపెడ్‌ల నుంచి అత్యాధునిక 310 సి సి స్పోర్ట్స్ వాహనాల వరకు, స్కూటర్లు, విద్యుత్ ఆధారిత ద్విచక్ర వాహనాలు, తక్కువ ధరలో లభించే ఆర్థిక వాహనాలు ఇలా అన్ని విభాగాల్లో టీవీఎస్ తన ప్రత్యేకతను చాటుకుందని పేర్కొన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కొత్త నమూనాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన వాహనాలను నిరంతరం మార్కెట్‌కు పరిచయం చేస్తోందని వివరించారు. ప్రాంతీయ సర్వీస్ మేనేజర్ రోనాల్డ్ రాబర్ట్ మాట్లాడుతూ వాహనం విక్రయించడమే కాకుండా విక్రయానంతర సేవలకు కూడా టీవీఎస్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాణ్యమైన సేవలు, విడిభాగాల లభ్యత, శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులతో వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. సి.ఎం.ఆర్ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం మాట్లాడుతూ అమలాపురం ప్రజలకు టీవీఎస్‌కు చెందిన అన్ని రకాల ద్విచక్ర వాహన నమూనాలు, వివిధ రంగులలో అందుబాటులో ఉంచామని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన వాహనాలతో పాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు, పారదర్శక వ్యవహార శైలి, తక్షణ సేవలు, విడిభాగాల సౌకర్యం, నిర్వహణ సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అమలాపురం ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల టీవీఎస్ ద్విచక్ర వాహనాలను ఒకే చోట పరిశీలించి కొనుగోలు చేసే అవకాశం ఈ షోరూమ్ ద్వారా కలుగుతుందని, వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అత్యుత్తమ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ సంస్థ ప్రతినిధులు, సి.ఎం.ఆర్ ఆటోమోటివ్స్ సిబ్బంది, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వినియోగదారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన షోరూమ్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# కాకినాడ రూరల్ మండల తహశీల్దార్‌గా పోతురాజు బాధ్యతలు స్వీకరణ



**కాకినాడ రూరల్, జూలై 9 (వార్తాప్రభ) :** పశ్చిమ గోదావరి జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన సంబలదీవి పోతురాజు పదోన్నతి పొంది కాకినాడ రూరల్ తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన కాకినాడ రూరల్ మండల కార్యాలయంలో తహశీల్దార్‌గా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. పరిపాలనా అనుభవం కలిగిన పోతురాజు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో సేవలు అందించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడంలో ఆయనకు మంచి అనుభవం ఉందని సహచర అధికారులు పేర్కొంటున్నారు. భూ సమస్యలు, ఆదాయ, కుల, నివాస ధృవపత్రాలు, రెవెన్యూ సంబంధిత ఇతర సేవల పరిష్కారంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందే అవకాశముందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ రూరల్ మండలంలో రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, భూ వివాదాల పరిష్కారం, ప్రజా సమస్యల పరిష్కారంలో పోతురాజు ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని పోతురాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు

# కాకర్ల గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆర్డీఓ..



**తిరువూరు,జూలై 9 (వార్తాప్రభ) :** విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చికిత్స పొందుతూ మృతి చెందిన కూలీ మద్దెల బోసు కుటుంబాన్ని ఆర్డీవో ఏ.కుమార్ కాకర్ల గ్రామంలో పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని కలిసిన ఆయన, వారికి నిత్యావసర సరుకులు అందజేస బాసటగా నిలిచారు.ఈ సందర్భంగా బోసు కుటుంబ ఆర్థిక స్థితిగతులను ఆర్డీవో స్వయంగా పరిశీలించారు. కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న ఆయన, ప్రభుత్వం ద్వారా కాలనీ ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఇటీవల డయాలసిస్ చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన బోసు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి బలైనట్టు కుటుంబ సభ్యులు ఆరోపించిన సంగతి తెలిసిందే.మృతదేహాన్ని దించేందుకు డబ్బులు వసూలు చేయడం, అంబులెన్స్ నిరాకరించడం వంటి ఘటనలు తీవ్ర దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఆర్డీవో పరామర్శ, హామీ బాధిత కుటుంబానికి కొంతఊరటనిచ్చినట్టు స్థానికులు పేర్కొన్నారు.అయితే, హామీలు కాగితాలకే పరిమితం కాకుండా త్వరితగతిన అమలు కావాలని, అలాగే వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు కూడా చేపట్టాలని బాధిత కుటుంబం, స్థానికులు కోరుతున్నారు.

# గన్నవరం కు గత వైభవం తీసుకురావడమే నా లక్ష్యం

– విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు




**గన్నవరం, జూలై 9 (వార్తాప్రభ) :** గన్నవరం కు గత వైభవం తీసుకువస్తానని ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నానని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఎయిర్పోర్ట్ అడ్వైజరీ కమిటీ కమిటీ అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ మాట్లాడుతూ తాను ఎప్పుడూ ప్రైవేట్ పంచాయతీలు, సివిల్ సెటిల్‌మెంట్లు చేయలేదని... భూముల వ్యవహారాల్లో ఎలాంటి జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు. గత 12 సంవత్సరాలుగా రైతులకు ఉచితంగా మట్టి ఇవ్వని పరిస్థితిని మార్చి, ఇప్పుడు ఉచితంగా మట్టి అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ అక్రమాలు, రికార్డుల తారుమారు, భూదోపిడీ జరిగిన అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించి విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. మాజీ ఎమ్మార్వోలు నరసింహారావు, మాధురి హయాంలో జరిగిన వ్యవహారాలపై కూడా విచారణ జరగాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. మర్లపాలెం ప్రాంత రైతుల భూములు 22-ఏ జాబితాలో చేరడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని సరిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గత వైసిపి ప్రభుత్వంలో అనేక భూ సమస్యలు ఏర్పడ్డాయని, ప్రస్తుతం డబ్బు ఇచ్చే వారు కూడా వెనుకడుగు వేస్తున్న పరిస్థితి నెలకొన్నదన్నారు. సేల్ డీడ్ చేసిన తర్వాత భూములు తిరిగి ఇవ్వని ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. భూ తాకట్టు వ్యవహారాలను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని రెవెన్యూ మంత్రిని, ముఖ్యమంత్రిని అసెంబ్లీ వేదికగా కోరినట్లు తెలిపారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ భూముల వివాదాలు, ప్రైవేట్ పంచాయతీలు, సెటిల్‌మెంట్లలో జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు. గతంలో జరిగిన విధంగా పనికిమాలిన రాజకీయాలు, వ్యక్తిగత సెటిల్‌మెంట్లు తన హయాంలో ఉండవని, గన్నవరం నియోజకవర్గంలో అలాంటి వ్యవహారాలకు తావు ఉండదని యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు.

# అడ్డంగా వ్యవహరిస్తున్నా...అడిగేదెవ్వరు..

● గ్రామ పంచాయతీకి ఆత్మ లాంటి మినిట్ బుక్ దుర్వినియోగం.

**మోపిదేవి/అవనిగడ్డ,జూలై 9 (వార్తాప్రభ) :** ఆరు నెలల క్రితమే బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీకి ఆత్మ లాంటి మినిట్ బుక్ దుర్వినియోగానికి పాల్పడుతూ గ్రామస్తులకు అడ్డంగా దొరికిపోయిన వైనమిది.మోపిదేవి మండలంలో తీవ్ర చర్చనీయాంశమైన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.మోపిదేవి మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన జి.వాసుదేవరావు ఆరు నెలల క్రితమే డిప్యుటేషన్ పై అమరావతి బదిలీపై వెళ్ళారు.కానీ ఇంత వరకు సదరు పంచాయతీ రికార్డులను కొత్త కార్యదర్శికి అప్పగించలేదు.సదరు విషయం స్థానిక ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోనట్లు తెలుస్తోంది.ఇలా ఉండగా బుధవారం వెంకటాపురం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చిన బదిలీపై వెళ్లిన కార్యదర్శి వాసుదేవరావు మినిట్ బుక్ లో అంతకు ముందే ఖాలీలు అట్టి పెట్టుకుని వాటిని నింపుతూ గ్రామస్తులకు అడ్డంగా దొరికిపోయాడు.దొంగ బిల్లులతో మినిట్ బుక్ ఖాలీలు నింపి ప్రభుత్వ ధనాన్ని పెద్ద మొత్తంలో దోచేసేందుకు సదరు కార్యదర్శి వాసుదేవరావు కుట్ర చేస్తున్నారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.గ్రామస్తులు నిలదీయడంతో అసహనానికి గురైన సదరు కార్యదర్శి నా ఇష్టం వచ్చినట్టు చేస్తా , మీకేందుకు అంటూ ఎదురుదాడికి దిగినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.ఇతను పనిచేసిన కాలంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు.మినిట్ బుక్ ఖాలీలు నింపడం ఆపకుంటే సదరు వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటే చేసుకోండి నాకేమన్నా భయమా అని సదరు కార్యదర్శి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని గ్రామస్తులు చెబుతున్నారు.అప్పటి వరకు అక్కడే ఉన్న మాజీ సర్పంచ్ మెల్లిగా అక్కడినుండి జారుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.జిఓ నెంబర్ 227 ప్రకారం గ్రామ పంచాయతీ పాలకవర్గం సమావేశం ముగిసిన వెంటనే హాజరైన సభ్యుల సమక్షంలో సదరు పాలకవర్గ తీర్మానాలను మినిట్ బుక్ లో నమోదు చేయాలి.అలా చేయని పక్షంలో సదరు కార్యదర్శి పై చర్యలు తీసుకోవచ్చని జిఓ స్పష్టం చేస్తుంది.సదరు వ్యవహారంపై అధికారుల స్పందనఎలా ఉంటుందో తేలాల్సి ఉంది.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188